నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 3-6-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 265 | పేజీలు: 4 | వెల: రూ.1/-

నిసర్గ ముంచుకొస్తోంది.. అప్రమత్తంగా ఉండండి: ప్రధాని

ముంబై, జూన్ 2: అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండగా, తుఫానుగా మారి తీరం వైపు దూసుకొస్తున్నది. ఈ తుఫానుకు ఐఎండీ అధికారులు నిసర్గ అని పేరుపెట్టారు. ఈ నిసర్గ తుఫాను బుధవారం రాత్రికల్లా మహారాష్ట్రలోని హరిహరేశ్వర్లో తీరాన్ని తాకే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ తుఫాను కారణంగా ఏ ఒక్కరికి హాని జరుగవద్దని, అందరూ క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు ప్రధాని ట్వీట్ చేశారు. తుఫాను పరిస్థితులను ఎదుర్కునేందుకు పశ్చిమ తీరం వెంబడి ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని ప్రధాని తెలిపారు. ప్రజలు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

తెలంగాణ ఏర్పాటుతో సమస్యలను పరిష్కరించుకున్నాం

సాగుతాగునీటి రంగాల్లో అద్భుత ప్రగతిని సాధించాం
ప్రగతిభవన్‌లో జెండా ఆవిష్కరణలో సీఎం కెసిఆర్
గన్‌పార్క్ వద్ద అమరులకు సీఎం కెసిఆర్ నివాళి
నిరాడంబరంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు
అసెంబ్లీలో జెండా ఎగురేసిన గుత్తా, పోచారం

హైదరాబాద్,జూన్2(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రయాణం అనుకున్నరీతిలో ఎంతో ఆశావహంగా ప్రారంభమైందని, తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పునరంకితమవుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఆరు వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో జాతీయజెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ... తెలంగాణ ఏర్పడితే ఏ సమస్యలు తీరుతాయని ఆశించామో ఆ సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. రాష్ట్రం ఏర్పడేనాటికి రైతుల పరిస్థితి, వ్యవసాయం దారుణంగా ఉండేదన్నారు. నేడు తెలంగాణలో వ్యవసాయం దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. ఎండాకాలం వస్తే ప్రజలు మంచినీళ్ల కోసం గోస పడేవారన్నారు. అదే నేడు మిషన్ భగీరథతో నీటి సమస్య తీరిందన్నారు. విద్యుత్, సాగునీరు, విద్య, వైద్య, పారిశ్రామిక, ఐటీ తదితర రంగాల్లో ఎంతో ప్రగతి సాధించామని సీఎం పేర్కొన్నారు. అంతకుముందు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ అమరవీరులకు నివాళులు అర్పించారు. గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద సీఎం పుష్పాంజలి సమర్పించి ఘన నివాళులర్పించారు. ప్రగతి భవన్ నుంచి గన్‌పార్క్ చేరుకున్న ఆయన అమర వీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. హోంమంత్రి మహమూద్ అలీ, ఎంపీ సంతోష్ కుమార్, సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్ అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. తెలంగాణ భవన్‌లోలో నిరాడంబరంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. పార్టీ పార్లమెంటరీ నేత కే కేశవరావు జాతీయ జెండా ఎగురవేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఆరో వార్షికోత్సం సందర్భంగా అసెంబ్లీలో నిరాడంబరంగా వేడుకలు నిర్వహించారు. శాసనమండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజలకు రాష్ట్ర అవతర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో జాతీయ జెండాను ఎగురవేశారు. అసెంబ్లీ ఆవరణలోని మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు ఇరువురు నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్సీలు, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించేందుకు గన్‌పార్క్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఓ నిరుద్యోగి అడ్డుకున్నారు. సీఎం కార్ డోర్ దగ్గరకు వెళ్లిన ఉద్యోగి తనకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు నిరుద్యోగిని అదుపులోకి తీసుకున్నారు. కరోనా నేపథ్యంలో ఆవిర్భావ వేడుకలను నిరాడంబరంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. తెలంగాణ అవతరణ దినోత్సవం వేడుకలు కొన్ని చోట్ల నిరసనలకు దారి తీస్తున్నాయి. జయశంకర్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఓ యువకుడు పురుగుల మందు డబ్బాతో నిరసనకు దిగాడు. భూరికార్డుల్లో తన పేరు నమోదు చేయడం లేదంటూ యువకుడు నిరసన వ్యక్తం చేశాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యువకుడు మహదేవ్‌పూర్‌కు చెందిన మధుగా గుర్తించారు.

2.తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతిభవన్‌లో జాతీయ జెండా ఆవిష్కరించి వందన సమర్పణ చేసిన సిఎం కెసిఆర్. చిత్రంలో సిఎస్ సోమేశ్ కుమార్,డిజిపి మహేందర్ రెడ్డిలు కూడా ఉన్నారు.

తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షల వెల్లువ

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని గవర్నర్ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ,జూన్2(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోడీ గవర్నర్ తమిళసైలు తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి పనిచేసే తెలంగాణ ప్రజలు దేశానికి అందించిన సేవలు చిరస్మరణీ యమని కోవింద్ అన్నారు. యావత్ దేశం గర్వించే సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం తెలుగువారి సొంతమని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం సుసంపన్న భవిష్యత్ దిశగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆ మేరకు ఆయన తెలుగులో ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సోదర

సోదరీమణులకు నమస్కారం! తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు. యావత్ భారతదేశం గర్వించే సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం తెలుగు వారి సొంతం. కష్టపడి పనిచేసే తెలంగాణ ప్రజలు దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం. తెలంగాణ రాష్ట్రం సుసంపన్న భవిష్యత్ దిశగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను' అంటూ రాష్ట్రపతి తెలుగులో ట్వీట్ చేశారు. రాష్ట్రపతితో పాటు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు తెలుగు, ఇంగ్లీష్, హిందీ మూడు భాషల్లో ట్వీట్ చేశారు. 'తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు. ఘనమైన చరిత్ర, సహజవనరులతోపాటు భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబిస్తున్న తెలంగాణ.. వివిధ రంగాల్లో గణనీయమైన ప్రగతితో దేశాభివృద్ధిలో తనవంతు పాత్రను కొనసాగిస్తూ.. మరింత సమృద్ధిని సాధించాలని ఆకాంక్షిస్తు న్నానంటూ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ట్వీట్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలకు రాష్ట్రావతరణ దిన శుభాకాంక్షలు. ఈ రాష్ట్ర ప్రజలు ఎన్నో క్షేత్రాలో తమ ప్రతిభను చాటుతున్నారు. దేశ ప్రగతిలో ఈ రాష్ట్రం ఓ ముఖ్య భూమిక పోషిస్తోంది. తెలంగాణ ప్రజల అభ్యున్నతి, శ్రేయస్సుకై నేను ప్రార్థిస్తున్నానంటూ తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని ట్వీట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు నా శుభాకాంక్షలు. కృషి, పట్టుదల, ఈ సంస్కృతికి మారు పేరు. దేశ పురోభివృద్ధిలో ఈ రాష్ట్ర భూమిక ఎంతో గణనీయమైనది. ఈ రాష్ట్ర ప్రజల అన్ని ప్రయత్నాలూ విజయవంతం కావాలని ఆశిస్తున్నాను'అంటూ మరో ట్వీట్‌లో ఏపీ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలియజేశారు. 2014, జూన్2వ తేదీన 29 వ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా ముందడుగు వేస్తుందన్నారు. ఈ ఆరు సంవత్సరాల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కోవిడ్ 19ను పరిస్థితిని ఎదుర్కొవడానికి రాష్ట్ర ప్రజలు ధైర్యంగా పోరాడుతున్నారు. సానుకూల స్ఫూర్తితో, తెలంగాణ సంపన్న, ఆరోగ్యకరమైన రాష్ట్రమని నిరూపిస్తూ తాము కచ్చితంగా విజయవంతంగా బయటకు వస్తామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలందరికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకంక్షలు! కేసీఆర్ గారి బాటలో రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ప్రతి తెలంగాణ బిడ్డకు వందనం!! ఉద్యమ ప్రస్థానంలో అమరులైన వీరులకు జోహార్లు అంటూ మాజీ ఎంపీ కవిత ట్వీట్ చేశారు.

భారత ఆర్థికవ్యవస్థ గాడిలో పడుతుంది

అన్‌లాక్ వన్‌తో ఆ ప్రక్రియ మొదలైంది
భారతీయ నైపుణ్యం, ఆవిష్కరణ మీద నమ్మకం ఉంది
కరోనా సవాళ్లు తాత్కాలికమేనన్న ప్రధాని మోడీ
-సిఐ సదస్సులో ప్రసంగించిన ప్రధాని

న్యూఢిల్లీ,జూన్2(ఆర్ఎన్ఎ): భారత ఆర్థిక వ్యవస్థ మళ్లీ గాడిలోపడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) 125వ సంవత్సరం సందర్భంగా ఆర్థికవేత్తలను ఉద్దేశించి మంగళవారం ప్రధాని మాట్లాడారు. కరోనా వైరస్ లాక్‌డౌన్ నుంచి భారత ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోందని, అన్‌లాక్ వన్‌తో ఆ ప్రక్రియ మొదలైనట్లు ఆయన పేర్కొన్నారు. కచ్చితంగా మళ్లీ వృద్ధి సాధిస్తామన్నారు. ప్రారంభమైందని, వారంలో రెండో దశ ప్రారంభమవుతుందని తెలిపారు. కరోనా కాలంలో ఆన్‌లైన్ ప్రోగ్రామ్స్ అవశ్యకత తెలిపిన ఆయన ప్రభుత్వం సైతం ఆ దిశగా పయనిస్తోందని ఉద్ఘాటించారు. ఇక దేశంలో ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకుంటు న్నామని వివరించారు. కరోనా సవాళ్లు తాత్కాలికమేనని మళ్లీ వృద్ధిరేటు పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంతో ప్రాధాన్యత వహిస్తామని ప్రధాని మోదీ అన్నారు. ఇంటెంట్, ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్నోవేషన్‌పై తాము దృష్టి సారించామని ప్రధాని మోదీ అన్నారు. విపత్కర సమయంలో ఆత్మ నిర్భర్ భారత్ ప్యాకేజీ ప్రకటించామని గుర్తు చేశారు. ఎంఎస్ఎంఈలు నిలదొక్కుకునేలా చర్యలు తీసుకున్నామని మోదీ వెల్లడించారు. ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా మేడిన్ ఇండియా ఉత్పత్తులను తయారు చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ దిశగా స్వయం సమృద్ధి దిశగా చర్యలు కీలకమని చెప్పారు. బలమైన ఆకాంక్ష, సమ్మిళిత వృద్ధి, పెట్టుబడులు, మౌలిక వసతులు, వినూత్న ఆలోచనలు వంటి పంచ సూత్రాలు స్వయం సమృద్ధికి అవసరమని చెప్పారు. భారత పరిశ్రమలు, మన సామర్థ్యం, సాంకేతికత పట్ల సర్వత్రా విశ్వాసం ఉందని అన్నారు. కోవిడ్-19 బారి నుంచి ప్రజలను కాపాడుకుంటూ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలోకి తేవడంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందని స్పష్టం చేశారు. ముందస్తు లాక్‌డౌన్‌తో మనం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. ఎంఎస్ఎంఈలు నిలదొక్కుకునేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆత్మనిర్భర్ ప్యాకేజ్‌తో దీర్ఘకాల వృద్ధికి బాటలు పరిచామన్నారు. ఉపాధి అవకాశాలు పెంచేందుకు సంస్కరణలు అవసరమని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ సత్వరం కోలుకునేలా చూడాలని ఆర్థిక వ్యవస్థ బలోపేతమే తమ ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు. వైరస్‌ను ఎదుర్కొనేందుకు కఠిన చర్యలు అవసరమని అన్నారు. ఇక వ్యవసాయ ఉత్పత్తులకు ఈ ట్రేడింగ్ విధానం ప్రవేశపెడతామని, రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. వినూత్న ఆలోచనలతో అన్ని రంగాల్లో వృద్ధి సాధ్యమని అన్నారు.

సిఐఐ సమావేశంలో వీడియా కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన ప్రధాని మోడీ

నేనింత దృఢవిశ్వాసంతో ఎలా ఉన్నానని మీరు ఆశ్చర్యపోతారని, భారతీయ నైపుణ్యం, ఆవిష్కరణ మీద తనకు నమ్మకం ఉన్నదన్నారు. కష్టపడే తత్వం, అకుంఠితదీక్ష మన వ్యాపారవేత్తలకు ఉన్నట్లు ఆయన తెలిపారు. మనం లాక్‌డౌన్ దశ నుంచి అన్‌లాక్ దశకు చేరుకున్నామంటే.. ప్రగతి పథం మళ్లీ మొదలైనట్లే అని మోదీ అన్నారు. భారత్‌ను స్వయం సమృద్ధిగా మార్చాలంటే.. ఉత్సాహం, సమష్టితత్వం, పెట్టుబడి, మౌళికసదుపాయాలు, ఆవిష్కరణలు అవసరమని ప్రధాని తెలిపారు. మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులను.. మేడ్ ఫర్ ద వరల్డ్‌గా తయారు చేయాలన్నారు. కోవిడ్-19 నుంచి ప్రజలను కాపాడుకుంటూనే ఆర్థికవ్యవస్థను మెరుగుపర్చాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. తొలి దశ అన్‌లాక్

అందరి పోరాటంతోనే తెలంగాణ ఏర్పాటు

ఒక్కరి పోరాటంతో ఏర్పడలేదు: కోదండరామ్

హైదరాబాద్,జూన్2(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ ఒక్కరి వల్లే తెలంగాణ రాలేదని.. తెలంగాణ సమాజం కోట్లాడితేనే రాష్ట్రం ఏర్పడిందని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం చెప్పుకొచ్చారు.ఒక వ్యక్తి వల్లే తెలంగాణ వచ్చిందని నమ్మించే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. సమిష్టి పోరాటం చేయకుంటే తెలంగాణకు తీరని నష్టం జరుగుతోందన్నారు. తెలంగాణలో ఉద్యమ ఆకాంక్షలు ఆశయాలు నెరవేరటం లేదని ఆయన ఆరోపించారు. గుప్పెడు మంది ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడ్తున్నారు. తెలంగాణ జనసమితి కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. గుప్పెడు మంది సంపన్నుల ఆస్తులు మాత్రమే పెరుగుతున్నాయన్నారు. కృష్ణా నీటిని కాపాడలేని పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వముంది. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో అందరికీ న్యాయం జరగట్లేదు. రెండున్నర లక్షల ఉద్యోగాల భర్తీ చేయటంలో కేసీఆర్ విఫలమయ్యారు. మంత్రులు, అధికారులు పోస్ట్ మ్యాన్ ఉద్యోగులు చేస్తున్నారు. తెలంగాణ అభివృద్ధికి ప్రగతి భవన్ ఆటంకంగా మారింది. జయశంకర్ సార్ చెప్పినట్లు రాష్ట్ర వచ్చాక అభివృద్ధి కోసం పోరాటం చేయాల్సిన సమయమెచ్చింది. నీళ్ళు, నిధులు, నియామకాలు తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవం కోసం ఉపయోగపడటంలేదని కోదండరాం చెప్పుకొచ్చారు.

ఏడుగురు ఉగ్రవాదుల అరెస్ట్

శ్రీనగర్,జూన్2(ఆర్ఎన్ఎ): జమ్ముకశ్మీర్‌లోని నౌషెరా సెక్టార్ వద్ద దేశంలోకి అక్రమ చొరబాటుకు యత్నించిన ఏడుగురు ఉగ్రవాదులను భద్రతా దళాలు అరెస్టు చేశాయి. పట్టుబడ్డ ఉగ్రవాదుల నుంచి రెండు ఏకే-47, పిస్తోల్, గ్రనేడ్లు, పాకిస్థాన్ ముద్రలున్న వస్తువులతోసహా భారీమొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఉగ్రవాదులను పట్టుకోవడానికి నాలుగు రోజులుగా ఆపరేషన్ కొనసాగిస్తున్నామని నార్తర్న్ కార్ప్స్ అధికారులు ప్రకటించారు. గత నెల 28న నియంత్రణా రేఖ వద్ద జరిగిన కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమవగా, ఒకరికి గాయాలయ్యాయి.

శంషాబాద్‌లో తొలి కరోనా కేసు

రంగారెడ్డి,జూన్2(ఆర్ఎన్ఎ): శంషాబాద్ మున్సిపాలిటీలో తొలి కరోనా కేసు నమోదైంది. శంషాబాద్‌కు చెందిన వ్యక్తి హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. గత ఆరు రోజుల క్రితం శంషాబాద్‌కు వచ్చాడు. అతను పనిచేసే ఆసుపత్రిలోనే జియాగూడబస్తీకి చెందిన ఓ నర్సుకు కరోనా పాజిటివ్ వచ్చింది. దీంతో వైద్యులు ఆ వ్యక్తికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. దీంతో అతన్ని కోవిడ్ ఆసుపత్రికి తరలించారు. అతని కుటుంబ సభ్యును హోం క్వారంటైన్‌లో ఉంచినట్టు అధికారులు తెలిపారు. శంషాబాద్‌లో తొలికరోనా కేసురావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

తెలంగాణ ప్రజలకు దత్తాత్రేయ శుభాకాంక్షలు

హైదరాబాద్,జూన్2(ఆర్ఎన్ఎ): రాష్ట్రావతరణ దినోత్సవం జరుపుకుంటున్న తెలంగాణ ప్రజలకు హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ శుభాకాంక్షలు తెలిపారు. ఆరు వసంతాలు పూర్తి చేసుకున్న రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమించాలని ఆయన ఆకాంక్షించారు. కొవిడ్-19ను రాష్ట్ర ప్రజలు ధైర్యంగా ఎదుర్కొంటున్నారని దత్తాత్రేయ కొనియాడారు. గవర్నర్ తమిళిసైకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కరోనా బారిన పడిన చింతల రామచంద్రారెడ్డిని దత్తాత్రేయ ఫోనులో పరామర్శించారు. త్వరగా కోలుకుని తిరిగి ప్రజాజీవితంలో మమేకం కావాలని ఆకాంక్షించారు.

రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళసైని కలుసుకుని ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సిఎం కెసిఆర్, పలువురు నేతలు

అన్నిరంగాల్లో తెలంగాణ పురోగామి

ఆదర్శంగా నిలిచిందన్న గవర్నర్ తమిళసై
గవర్నర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కెసిఆర్

హైదరాబాద్,జూన్2(ఆర్ఎన్ఎ): అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ, సంక్షేమ పథకాలలో సరికొత్త ఆవిష్కరణలతో దేశానికి దిక్సూచిలా మారి మిగతా అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శ ప్రాయమైందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ... భారతదేశంలో మునుపెన్నడూ జరగని విధంగా తెలంగాణ ప్రజలు సుదీర్ఘ శాంతియుత పోరాటం జరిపి రాష్ట్రాన్ని సాధించుకున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఈ ఆరు సంవత్సరాల కాలంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు. ప్రజల సంతోషం, సంతృప్తియే ప్రభుత్వ పనితనానికి కొలమానమన్నారు. ప్రజల బలమైన భాగస్వామ్యంతో బంగారు తెలంగాణ అతి త్వరలోనే ఆవిష్కృతమౌతుందన్నారు. కోవిడ్-19 క్లిష్ట పరిస్థితిని ప్రజలు ధైర్యంగా ఎదుర్కొంటున్నారన్నారు. తెలంగాణను సంపన్న, ఆరోగ్యకరమైన రాష్ట్రంగా నిలపడంలో మనందరం తప్పక విజయం సాధిస్తామని పేర్కొన్నారు. ఇదిలావుంటే గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పుట్టినరోజు నేడు. 60వ వసంతంలో అడుగిడుతున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సీఎం కేసీఆర్ రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూర్తి ఆరోగ్యంతో సంపూర్ణ జీవితం గడపాలని సీఎం ఆకాంక్షించారు. ఆయన వెంట పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. సిఎస్ సోమేశ్ కుమార్,డిజిపి మహేందర్ రెడ్ డిలు కూడా ఉన్నారు.

గల్ఫ్ కార్మికులకు సరుకులు పంపిణీ

హైదరాబాద్,జూన్2(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారితో ప్రపంచ దేశాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. కరోనా బారి నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రపంచ దేశాలు లాక్ డౌన్ పాటిస్తుండటంతో ఉపాధి కోసం విదేశాలకు వలస వెళ్లిన గల్ఫ్ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు బహ్రైన్ టీఆర్ఎస్ ఎన్నారై సెల్ ముందుకొచ్చింది. వారికి నిత్యావసర సరుకులు అందజేసి బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా బహ్రైన్ టీఆర్ఎస్ ఎన్నారై సెల్ అధ్యక్షుడు రాధారపు సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు బోలిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ.. కరోనా కట్టడికి తెలంగాణలో సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అలాగే గల్ఫ్ నుంచి తిరిగి వచ్చే పేదలకు ఉచిత క్యారంటైన్ సౌకర్యం కల్పించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు.

చరిత్రలో నేటినిజం

కం॥ కన్నట్టి తెలంగాణా
కన్నుటిని తుదవ-నడుము గట్టిన ఘనుడై
అన్నుగ కృషి నాగలిచేడి
ఆ నేటు పాలకు రావు మనకులకు ఖ్యాతినే॥

-రాధశ్రీ
సెల్: 9494481210

(జూన్ 3 తన్నీరు హరీష్‌రావు జననం..)

ఇది కూడా మానవాళి స్వయంకృతమే.

నేటినిజం
బుధవారం 3-6-2020

పిల్లి పోయి ఎలక వచ్చె ధాం ధాం ధాం.. అనేది పాత సరదా! కరోనా క్రిమి పోకుండానే మిడత వచ్చె ధాం ధాం ధాం! కొన్నాళ్ళకు మిడత పోయి ఈగ వచ్చె ధాం ధాం ధాం" అన్నట్లు ఏ నిమిషంలో ఏది దాడి చేస్తుందో, మానవ జీవితాలను ఎంతగా అతలాకుతలం చేస్తాయో తెలియకుండా అగమ్యంగా ఉంది. కొత్త పదాలు. కరోనా వైరస్ మహమ్మారి రూపంలో పట్టిన పీడ వదలకముందే మిడతల దండు వచ్చిపడి మన దేశాన్ని గడగడలాడిస్తోంది. పది రోజుల క్రితం ఆ దండు పాకిస్తాన్ సరిహద్దులవైపు నుంచి ప్రవేశించి గుజరాత్, రాజస్తాన్‌లపై విరుచుకుపడి, అటుపై ఉత్తరప్రదేశ్ వైపు వెళ్తూ గాలివాటుకు రెండుగా చీలి ఒకటి మధ్యప్రదేశ్ దిశగా పోయి అక్కడ విధ్వంసకాండ సాగించింది. మరో దండు ఢిల్లీ, హర్యానా వైపు వెళ్లింది. మధ్యప్రదేశ్‌వైపు వెళ్లిన దండు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లవైపు మళ్లినట్టు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాలకు కూడా ముప్పు వుండొచ్చునన్న సమాచారంతో ప్రభుత్వ యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. మిడతల దండు మన దేశానికి కొత్తగాదు. గత పదేళ్లుగా అప్పుడప్పుడు వీటి తాకిడివున్నా, చాలా స్వల్ప సంఖ్యలో రావడం.. రాజస్తాన్, గుజరాత్‌లలోని ఒకటి రెండు జిల్లాలకు సమస్య ఏర్పడటం ఉండేది. ఈసారి అవి కోట్లాదిగా వచ్చిపడ్డాయి. ఇంతటి భారీ సంఖ్యలో మిడతలు మన దేశం వచ్చిన ఉదంతాలు 1787-నుండి 1796 మధ్య.. 1901 సం॥ నుండి 1908 మధ్య ఇదివరలో ఉన్నాయని చరిత్ర చెబుతోంది. ఆ తర్వాత కూడా మిడ తల దండు రావడం రివాజైనా కోట్లాదిగా వచ్చిన దాఖలా లేదు. అవి వచ్చి పంట పొలంపై వాల డాన్ని స్వయంగా వీక్షించిన రైతు ఒకరు 'ఎవరో ఆకాశం నుంచి ఒక పెద్ద వస్త్రాన్ని పొలంపై కప్పినట్టు అనిపించిందం'ని చెప్పాడంటే మిడతల దండు తీవ్రత అంచనా వేసుకోవచ్చు.

కోట్లాదిగా దండు కట్టడం, రోజుకు కనీసం 150 కిలోమీటర్ల దూరం వేగంగా ప్రయాణించడం ఈ కీటకాల ప్రత్యేకత. ఇవి పగటిపూట ప్రయాణిస్తూ ఏపుగా పెరిగిన పంట చేలపైనో, పచ్చని చెట్ల పైనో, పచ్చిక బయళ్లపైనో వాలతాయి. ఆకులు, పండ్లు, కూరగాయలు, జొన్న, వరి, ఇలా ఏది దొరికితే అది స్వాహా చేస్తాయి. చీకటి పడేవేళ వున్నచోటే వుండిపోతాయి. ఒక దండు కదిలిందంటే అందులో కనీసం నాలుగు కోట్ల మిడతలుంటాయని, అవి ఒక్క రోజులో 35,000 మంది తినే ఆహారాన్ని ఖాళీ చేస్తాయని ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ చెబుతోంది. అంతర్జాతీయ స్థాయిలో మిడతల తీరుతెన్నులపై అధ్యయనం చేసే ఏకైక సంస్థ అది. మిడతల దండు తాకిడికి లోనైన దేశాలు ఇచ్చే సమాచారాన్ని అందుకుని, అక్కడి వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేసి, ఆ దండు ఎటువైపు పోయే అవకాశం వుందో అంచనాకు రావడం... ఆ దిశగా వున్న దేశాలను అప్ర మత్తం చేయడం దాని బాధ్యత. నిజానికి ఇప్పుడేర్పడిన బెడద చిన్నదని, వచ్చే నెలకల్లా అది మరింత ఉగ్రరూపం దాల్చే ప్రమాదం వున్నదని ఎఫ్ఏఓ మన దేశాన్ని హెచ్చరించింది. తూర్పు ఆఫ్రికా నుంచి పాకిస్తాన్ మీదుగా భారత్‌కి వచ్చిపడే ఆ మిడతల దండు మరింత పెద్దగా ఉండొచ్చు నంటున్నది. మిడతల దండు వల్ల ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుంది. కోట్లాదిమంది వినియోగించే ఆహారధాన్యాలు, కూరగాయలు, పండ్లు, ఫలాలు వగైరాలను అవి స్వాహా చేస్తాయి. చాన్నాళ్ల తర్వాత ఈ ఏడాది పంటలు బాగా పండాయి. కానీ లాక్‌డౌన్ కారణంగా అవాంతరాలేర్పడ్డాయి. సకాలంలో పంట కోయలేక రైతులు అగచాట్లు పడ్డారు. దాని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా ఉండగలదని అంచనా వేశారు. ఇప్పుడొచ్చిపడిన మిడతల దండు ఈ పరిస్థితిని మరింతగా కుంగ దీస్తుందని నిపుణులు చెబుతున్న మాట. అదృష్టవశాత్తూ రబీ పంట కోతలు ఇప్పటికే ముగిశాయి. ఖరీఫ్‌కి ఇంకా వ్యవధి వుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో వేసవిలో చేతికందే పప్పుధాన్యాలు, కూరగాయలు, పత్తి వగైరాలు ఈ మిడతల దండువల్ల నష్టపోయే అవకాశం వుంది. ఇంకో ప్రమాదం కూడా వుంది... సరిగ్గా రుతుపవనాలు ప్రవేశించి, వానలు కురవడం ప్రారంభమయ్యాక వచ్చే మిడతలు భారీగా గుడ్లు పెడతాయంటున్నారు. ఒక్కో ఆడ మిడత 750 గుడ్లుపెడుతుందని, వాటివల్ల రెండేళ్లపాటు సమస్యలేర్పడే అవకాశం వుందని నిపుణులు అంటున్నారు.

నగరంలో మరోమారు విజృంభిస్తున్న కరోనా

పెరుగుతున్న కేసులతో నగర ప్రజల్లో ఆందోళన

హైదరాబాద్,జూన్2(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్‌సడలింపులతో గ్రేటర్ హైదరాబాద్‌లో రోజూ పెరుగుతున్న కరోనా కేసులు మరింతగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే 15 మంది చిరువ్యాపారులకు పాజిటివ్‌వచ్చింది. వీరికి ఎవరి నుంచి వ్యాప్తి అయ్యిందనే దానిపై స్పష్టత లేదు. బల్దియా అధికారులు కాంటాక్ట్లు కనిపెట్టే పనిలో పడ్డారు. కరోనా ఎఫెక్ట్ మొదలయిన నాటి నుంచి నిత్యావసరాల అమ్మకాలకు పర్మిషన్స్ ఉన్నాయి. ప్రజలు కూడా మార్కెట్లకు వెళ్లేప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రిలాక్సేషన్స్ ఇచ్చాక గుంపులుగా తిరగడంతో ప్రస్తుతం వైరస్ వేగంగా విస్తరిస్తోంది. జియాగూడ, ఖైరతాబాద్, ముషీరాబాద్ ఏరియాలకు చెందిన15 మంది కూరగాయల వ్యాపారులకు పాజిటివ్‌వచ్చింది. ఖైరతాబాద్ గణేశ్‌ఏరియాలో ఉండే వృద్ధురాలు కూరగాయలు అమ్ముతుంది. ఇటీవల ఆమె ఆరోగ్యం బాగోలేకపోవడంతో జియాగూడలో ఉండే కూతురు, అల్లుడు వచ్చి పరామర్శించి వెళ్లారు. పరిస్థితి విషమించి నాలుగు రోజుల కిందట ఆమె మృతి చెందింది. టెస్టుల్లో కరోనా సోకినట్టు తేలింది. వెంటనే కూతురు, అల్లుడికి టెస్టులు చేయగా పాజిటివ్‌వచ్చింది. అలాగే వృద్ధురాలిని పరామర్శించిన మరో 8 మందికి వైరస్‌సోకినట్టు స్పష్టమైంది. మరికొందరిలో లక్షణాలు ఉన్నట్లు తెలిసింది. వీరు ఖైరతాబాద్, రాజ్‌భవన్‌రోడ్‌లో తోపుడు బండ్లు పెట్టి, మరికొందరు ఇంటింటికి తిరిగి కూరగాయలు, పండ్లు అమ్ముతుంటారని తెలిసింది. ముషీరాబాద్‌ముత్యాల బస్తీలో ఓ కూరగాయల వ్యాపారికి కరోనా వచ్చింది. గ్రేటర్ పరిధిలో ఆదివారం ఒక్కరోజే 122, సోమవారం 79 కేసులు వచ్చాయి. కొందరు మార్కెట్లలో రూల్స్ బ్రేక్ చేస్తూ గుమిగూడుతున్నారు. సడలింపులిచ్చారని మాస్కులు, ఫిజికల్ డిస్టెన్స్‌ను తేలికగా తీసుకుంటున్నారు. కేసులు భారీగా పెరగడానికి సడలింపులే కారణమని బల్దియా అధికారులు స్పష్టం చేస్తున్నారు. బయటికెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే వైరస్ బారిన పడతారని హెచ్చరిస్తున్నారు. సిటీలో చాలా కేసుల్లో లింకులు దొరకట్లేదు. కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ ద్వారానే వ్యాధి విస్తరిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తెలంగాణ అభివృద్ధి ఇప్పుడు ముఖ్యం

అన్ని వర్గాల సంక్షేమం కోసం రాష్ట్రావతరణ: పోచారం

కామారెడ్డి,జూన్2(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర 6వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కామారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో జాతీయ జెండాను రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర 6వ అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్న యావత్ తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చుకుంది అన్నీ వర్గాల సంక్షేమం కోసమేనన్నారు. దశాబ్దాల పోరాటం, అమరవీరుల బలిదానాలు, కేసీఆర్ మడమతిప్పని పోరాట ఫలితమే కోట్లాది మంది తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కలను నెరవేర్చిందన్నారు. దేశ ప్రజలకు స్వాతంత్ర్యదినోత్సవం, గణతంత్ర దినోత్సవం ఎలానో తెలంగాణ ప్రజలకు జూన్ 2 అవతరణ దినోత్సవం అలాంటిదేనని పోచారం తెలిపారు. రాష్ట్ర సాధన ఎంత ముఖ్యమో, రాష్ట్ర అభివృద్ధి కూడా అంతే ముఖ్యమన్నారు. తెలంగాణ ప్రజలు కోరుకున్న దానికంటే ఎక్కువ అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రం చేపట్టని పథకాలను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని పోచారం తెలిపారు

ఆత్మ నిర్భర్ భారత్ పథకానికి రోడ్ మ్యాప్

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రత్యేక ప్యాకేజీ
దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో రైతులు, ఎంఎస్ఎంఈలది కీలక పాత్ర
కేబినేటే వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ,జూన్2(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ నేపథ్యంలో లాక్‌డౌన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వ పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. ఈ మేరకు సోమవారం జరిగిన కేంద్ర కేబినెట్ నిర్ణయాలను మంత్రి ప్రకాశ్ జవడేకర్ మీడియా ముందు వెల్లడించారు. ఆత్మ నిర్భర్ భారత్ పథకానికి రోడ్ మ్యాప్ రూపొందించామని తెలిపారు. కరోనా కారణంగా ఇబ్బందుల్లో కూరుకు పోయిన రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకోవాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు రైతులు, ఎంఎస్ఎంఈలను ఆదుకునేలా కీలక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో రైతులు, ఎంఎస్ఎంఈలది కీలక పాత్ర అని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో జవడేకర్ వివరాలను వెల్లడిస్తూ.. 'సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా సరికొత్త అర్థాన్ని ఇచ్చాం. ఎంఎస్ఎంఈలను ఆదుకునేందుకు రూ.50వేలకోట్లు ఈక్విటీ పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నాం. ఎంఎస్ఎంఈ రంగానికి 20 వేల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటిస్తున్నాం. ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు మార్కెట్లో లిస్టింగ్ చేసే అవకాశం కల్పిస్తున్నాం. వీధి వ్యాపారులను ఆదుకునేందుకు సత్వరమే రూ.10 వేలు రుణం ఇవ్వాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. దీని ద్వారా 50 లక్షల మంది వీధి వ్యాపారులకు లబ్ది చేకూరనుంది. రైతులను ఆదుకునేందుకు కిసాన్ క్రెడిట్ కార్డుల పథకం అమల్లోకి తెస్తాం. ఇప్పటికే 14 పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటించాం' అని పేర్కొన్నారు. ఆర్థికవ్యవస్థ బలోపేతంలో ఎంఎస్ఎంఈలది కీలకపాత్ర అని..దేశప్రగతిలో ఎంఎస్ఎంఈలు ముఖ్యపాత్ర పోషించాల్సి ఉందని కేంద్రమంత్రి జవడేకర్ అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా 6 కోట్లకుపైగా ఎంఎస్ఎంఈలున్నాయని. ఎంఎస్ఎంఈల నిర్వచనం మరింత విస్తరించామని కేంద్ర సమాచారశాఖ మంత్రి ప్రకాశ్ జవడేకర్ అన్నారు. ఎంఎస్ఎంఈల కోసం రూ.50 వేల కోట్ల ఈక్విటీ పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు. రైతులను ఆదుకునేందుకు అనేక చర్యలు తీసుకున్నామన్నారు. కరోనా మహమ్మారి కారణంగా పేదలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లాక్‌డౌన్ ప్రకటించిన రెండు రోజుల్లోనే రూ.1.70 లక్షల కోట్ల ప్యాకేజీని ప్రకటించడం జరిగింది. 20 కోట్ల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమచేశామని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం నుంచి ఒకటిన్నర రెట్లు కనీస మద్దతు ధర పెంచుతున్నట్టు కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. కేంద్రమంత్రి తోమర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ..రైతులకు అండగా నిలిచేందుకు 14 రకాల ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర అమలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులకు ఖరీఫ్ పంటలకు 50 నుంచి 83 శాతం అధిక మద్దతు ధర ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రైతులకు రుణాలు చెల్లించేందుకు ఆగస్టు వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. వీధి వ్యాపారుల కోసం రుణ పథకం అమలు చేస్తామని, రుణ పథకం ద్వారా 50 లక్షల మంది వీధి వ్యాపారులకు లబ్దిచేకూరుతుందన్నారు. ఈ సమావేశంలో నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. 'దేశ జీడీపీలో 29వాతం సూక్ష్మ చిన్న పరిశ్రమలదే. ఆరు కోట్ల చిన్న పరిశ్రమలు 11 కోట్ల ఉద్యోగాలు ఇస్తున్నాయి. మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న చిన్న పరిశ్రమలను స్టాక్ మార్కెట్లో పెడతాం. వాటిలో కొన్ని షేర్లను ప్రభుత్వం కొని వారికి మద్దతు ఇస్తుంది' అని తెలిపారు.

నివురుగప్పిన నిప్పులా జాత్యహంకారం

హైదరాబాద్, జూన్ 2:కరోనా కట్టడిలో విఫలమై ఇప్పటికే విమర్శలు ఎందుర్కొంటున్న అగ్రరాజ్యం అమెరికాలో జాత్యహంకార హత్యపై ప్రపంచ వ్యాప్తంగా ఆగ్రహజ్వాల వ్యక్తమవుతోంది. కరోనాకు సంబంధించిన చేదు అనుభవాలను పక్కన పెట్టిన ప్రజలు ఇప్పుడు రోడ్లపైకి వచ్చి పోలీసుల తీరుపై తమ ఆగ్రహాన్ని ప్రదర్శించారు. ఇంటా బయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న అధ్యక్షుడు ట్రంప్ ఈ వ్యవహారాన్ని చక్కదిద్దే బదులు రెచ్చ గొట్టే చర్యలతో హుంకరించడం ఆయన అసహనానికి పరాకాష్ట కాక మరోటి కాదు. అమెరికాలోని జాత్యహంకారంపై మినియాపోలిస్ నగరంలో ఒక పోలీసు చేతితో హత్యకు గురైన నల్లజాతీయుడు జార్జి ఫ్లాయిడ్ ఘటనపై ఇప్పటికే అమెరికా వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. అమెరికాలో జరుగుతున్న ఆందోళలనకు సంఘీభావంగా ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగడం చూస్తుంటే ఈ హత్యపట్ల ప్రపంచ ప్రజల్లో ఎంతటి ఆగ్రహం ఉందో తెలుసుకోవచ్చు. హత్య జరిగిన నాటి నుంచి వేలాది మంది రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు.

అల్లర్లను అదుపులో పెట్టాల్సిన అధ్యక్షుడు సైన్యాన్ని రంగంలోకి దింపుతామంటూ హెచ్చరికలు చేశారు. మొత్తంగా ఓ శ్వేతజాతి పోలీస్ జాత్యహంకారం కారణంగా అమెరికా రగిలిపోతోంది. నల్లజాతివారి నిరసనాగ్ని జ్వాలల్లో మాడిమసి అవుతున్నది. మిన్నెసొట్టా రాష్ట్రంలోని మినియా పొలిస్ నగరంలో వారం రోజుల క్రితం ఒక తెల్లజాతి పోలీసు అధికారి నడిరోడ్డుపై 46 ఏళ్ల జార్జి ఫ్లాయిడ్ అనే ఆఫ్రికన్ అమెరికన్ నల్లజాతీయుడి మెడ మీద మోకాలితో తొక్కి ఊపిరి ఆడకుండా చేసి చంపేసిన దారుణ ఉదంతం జాత్య హంకార హత్యకు పరాకాష్టగా నిలిచింది.కొన్ని దశాబ్దాల తర్వాత తొలిసారిగా అగ్రరాజ్యాన్ని జనాగ్రహ మంటల్లోకి తోసి వేసింది. ఇంతకూ ఫ్లాయిడ్ క్షమించరాని నేరం ఏంటన్నది అంతుచిక్కడం లేదు. అలాగే హత్య చేయాల్సినంతగా పోలీస్ అధికారి శిక్షకు దిగడం ఎంతవరకు సమంజసమో తెలియడం లేదు.

ఊపిరి ఆడడం లేదని, మెడపై మొకాలు తీయాలని ఫ్లాయిడ్ మొరపెట్టుకున్నా వినకుండా అతడిని అంతం చేసిన శ్వేతజాతి అధికారి జాత్యహంకారం విడియో వైరల్ కావడంతో దేశమంతటా నల్లవారు ఆగ్రహంతో వీధుల్లోకి వచ్చి పలునగరాల్లో బీభత్సం సృష్టించారు. వారు సృష్టించిన విధ్వంసకాండ అమెరికాను తీవ్ర నష్టానికి గురి చేసింది. ఉద్రిక్తతలతో అధికారులు దేశాధ్యక్షుడు ట్రంప్ సురక్షిత స్థలానికి అంటే బంకర్‌లో దాచారాని ప్రచారం సాగింది. బిల్లుకు దొంగ నోటు చెల్లించిన అతి చిన్న నేరానికి ఫ్లాయిడ్‌ను మెడతొక్కి హతమార్చడం కేవలం అతడు నల్లజాతి వ్యక్తి కావడం వల్లనే సంభవించింది. అన్యాయం చేసిందెవరో, అదెంతటి ఘోరమైనదో, దాని గురయింది ఎవరో, వారు అక్కడ తరతరాలుగా అనుభవిస్తున్న జాతి వివక్ష మరెంతటి అమానుషమైనదో తెలిసి కూడా ట్రంప్ భిన్నజాతుల దేశానికి అధ్యక్షుడుగా కాకుండా తెల్లవారి ప్రతినిధిగా మాట్లాడి నిరసనకారుల్లో ప్రతీకారేచ్ఛను మరింతగా పెంచాడు. వారిని బందిపోటు దొంగలుగా పేర్కొని తనలో కూడా గూడు కట్టుకున్న శ్వేతజాతి దురహంకారాన్ని చాటుకున్నాడు. రానున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మరోమారు పోటీపడుతున్న ట్రంప్ తనకు అనుకూలంగా తెల్లవారి ఓట్లను గుండుగుత్తగా కొట్టేయడానికి ఈ హత్యను బాగా ఉపయోగించుకున్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. నల్లవారి ఆగ్రహం ఎంతగా కట్టలు తెంచుకున్నదో దాని ముందు అమెరికన్ పోలీసు వ్యవస్థ ఎలా ఎందుకూ పనికి రాకుండా పోతున్నదో అర్థం చేసుకోవచ్చు. జార్జి ఫ్లాయిడ్‌ను నదారుణంగా చంపేసిన పోలీసు అధికారి డెరెక్ చావిన్‌ను ఆలస్యంగానైనా అరెస్టు చేసినప్పటికీ పరిస్థితులు అదుపులోకి రావడలేదు. అంటే తెల్లవాళ్ల వ్యవస్థల నుంచి తమకు న్యాయం జరగబోదనే అపనమ్మకం నల్లవారిలో నాటుకుని పోయింది. దేశంలో లక్షకు పైగా ప్రాణాలను బలి తీసుకున్న కరోనా విజృంభణ తగ్గలేదు. అయినా మాస్కులు ధరించడం వంటి జాగ్రత్తలేమీ తీసుకోకుండానే జనం గుంపులు గుంపులుగా చేతికి చిక్కిన ప్రతి చిన్న ఆయుధంతోనూ వీధుల్లోకి విరుచుకుపడి వస్తున్నారు. జాత్యహంకార పోలీసులతో, పాలకులతో తాడోపేడో తేల్చుకోవాలనే నల్లజాతి వారిలో ఆక్రోశం ప్రస్ఫుటమవుతున్నది. అమెరికా అత్యంత సంపన్న దేశంగా ఎదగడానికి తోడ్పడిన ఆఫ్రో అమెరికన్ల కృషి, శ్రమ ఇంతా అంతా కాదు. వారిని బానిసలుగా చేసుకొని నరక బాధలు పెట్టిన తెల్ల జాతీయులు ఆఫ్రికన్ అమెరికన్లను ఇప్పటికీ పురుగుల మాదిరిగానే చూస్తుండడం అక్కడి ప్రజాస్వామ్యం బండారాన్ని బయట పెడుతున్నది. పాలకులు జాతుల మధ్య సామరస్యాన్ని, సహజీవనాన్ని కోరుకునే వారైతే ఇన్నాళ్ల తర్వాత మళ్లీ ఈ స్థాయిలో నిరసన మంటలు మిన్నంటి ఉండేవి కావు. సౌతాఫ్రికా లో నెల్సన్ మండేలాంటి మహానుభావుడిని ఏళ్లతర బడి జైలు పాల్జేసిన ఘటనలు.. స్వాంత్ర్యం తరవాత కూడా ప్రపంచంలో జాతి వివక్ష ఇంకా ముగియలేదనడానికి తాజా ఘటనలే నిదర్శనం. అందుకే ఈ హత్య పట్ల ప్రపంచ వ్యాప్తంగా నిరసన ధ్వనులు మిన్నంటాయి. ఒక్క అమెరికాకే ఈ ఆందోళన పరిమితం కాలేదు. లండన్, బెర్లిన్ వంటి నగరాల్లో కూడా ప్రతిధ్వనించింది. ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామ దేశం అని చెప్పుకుంటున్న అమెరికాలో జాత్యహంకారం ఇంకా నివురుగప్పిన నిప్పులా ఉందని నిరూపితం అయ్యింది. ప్రపంచానికి ఆదర్శంగా నిలబడాల్సిన అగ్రరాజ్యంలో ఇలాంటి హత్యలు చోటు చేసుకోవడం ప్రపంచాన్ని తలదించుకునేలా చేసింది. ఇలాంటి ఘటనలు మళ్లీ జరక్కుండా ప్రజల్లో వివక్ష అన్నది లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత పాలకులదే.

జాత్యహంకార హత్యపై ప్రపంచమంతా నిరసనలు

పలు నగరాల్లో అగ్రరాజ్యం తీరుపై ఆగ్రహం

వాషింగ్టన్,జూన్2(ఆర్ఎన్ఎ): అమెరికాలోని జాత్యహంకారంపై ప్రపంచ వ్యాప్తంగా ఆగ్రహజ్వాల వ్యక్తమవుతోంది. మినియాపోలిస్ నగరంలో ఒక పోలీసు చేతితో హత్యకు గురైన నల్లజాతీయుడు జార్జి ఎ÷-లాయిడ్ ఘటనపై ఇప్పటికే అమెరికా వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రరూపం దాల్చిన విషయం తెలిసిందే. తాజాగా అమెరికాలో జరుగుతున్న ఆందోళలనకు సంఘీభావంగా ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. ఈ సందర్భంగా వేలాది మంది రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. జర్మనీలోని పలు ప్రాంతాల్లో ఈ ఆందోళనలు జరిగాయి. బవేరియన్ రాజధాని మునిచ్‌లో దాదాపు 400 మంది శనివారం కూడి అమెరికా దౌత్యకార్యాలయం వైపునకు మార్చ్ చేశారు. బెర్లిన్‌లో ఆదివారం జరిగిన ఆందోళన ర్యాలీ కార్యక్రమంలో దాదాపు 1500 మందికి పైగా యువకులు పాల్గొన్నారు. 'జస్టిస్ ఫర్ జార్జి ఫ్లాయిడ్' అని నినాదాలు చేశారు. ' ఐ కాన్ట్ బ్రీత్, జస్టిస్ ఫర్ ఎ÷-లాయిడ్, బీయింగ్ బ్లాక్ ఈజ్ నాట్ ఏ క్రైమ్' అని పలువురు సంతకాలు చేశారు. అంతకుముందు పోలీసుల హింసాకాండను వ్యతిరేకిస్తూ నగరంలోని బ్రాండెన్‌బర్గ్ గేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని అమెరికా దౌత్యకార్యాలయం ఎదుట శనివారం నాడు ఆందోళనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో దాదాపు 2 వేలకు మంది పైగా పాల్గొన్నారు. డానిస్ రాజధాని కొపెన్‌హాగన్‌లో జరిగిన ఆందోళనలో 5 వేల మంది పాల్గొన్నారు. అదేవిధంగా ఇటలీలోని మిలాన్‌లో గత గురువారం అమెరికా దౌత్యకార్యాలయం ఎదుట నిరసనకారులు ఎ÷-లాయిడ్ హత్యకు సంబంధించిన చిత్రాలను ప్రదర్శిస్తూ పోలీసుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కెనడాలోని టోరటో పిట్స్ పార్క్ వద్ద ఆందోళనలు జరిగాయి. గత బుధవారం నగరంలో జరిగిన కొర్చిన్‌స్కి పాక్వెట్ మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. జెరూసలేం, టెలీ అవివ్ నగరాల్లో సంఘీభావ ఆందోళనలు జరిగాయి. ఇజ్రాయిల్ బోర్డర్ పోలీసుల చేతిలో బలైన ఇయాద్ హలాక్ అనే పాలస్తీనాకు చెందిన వికలాంగుడి హత్య ఘటనకు వ్యతిరేకంగా వందలాది మంది ఇజ్రాయిలీలు, పాలస్తీని యన్లు మార్చ్ నిర్వహించారు. జెరూ సలేం ఓల్డ్ సిటీలో హలాక్ హత్యకు గురయ్యారు. 'జస్టిస్ ఫర్ ఇయాద్, జస్టిస్ ఫర్ జార్జి' అన్న ప్లకార్డులు ప్రదర్శించారు. లండన్‌లోని ట్రఫల్‌గార్ స్క్వేర్ వద్ద వేలాది మంది హౌసింగ్ స్ట్రీట్, హౌసెస్ ఆఫ్ పార్లమెంట్ వైపునకు ర్యాలీ తీశారు. రాసిజం హ్యేజ్ నో ప్లేస్ అని ప్లకార్డులతో కూడిన నినాదాలు చేశారు.

కేరళలో నిలిచిపోయిన బోర్డు పరీక్షలు పూర్తి

ఓ విద్యార్థికోసం ప్రత్యేకంగా బోటు ఏర్పాటు

తిరువనంతపురం,జూన్2(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకొనేందుకు విధించిన లాక్‌డౌన్ కారణంగా అన్నిరకాల వ్యవస్థలు గత రెండు నెలలుగా మూగ బోయి.. ఇప్పుడిప్పుడు పనులు చేయడం ప్రారంభించాయి. కొవిడ్-19 కారణంగా గతంలో నిలిచిపోయిన బోర్డు పరీక్షలను జరిపేందుకు కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. శుక్ర, శనివారాల్లో బోర్డ్ ప్లస్ వన్ పరీక్షలు నిర్వహించింది. అయితే, ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు ఓ విద్యార్థి కోసం కేరళ ప్రభుత్వం ఏకంగా 70 సీట్ల బోట్‌ను నడిపి ప్రశంసలు అందుకొన్నది. అలప్పుజ జిల్లాలోని కుట్టనాడ్ ద్వీపకల్పంలో నివసించే 17 ఏండ్ల బాలిక సంద్రబాబు.. ప్లస్ వన్ పరీక్షలకు హాజరుకావాల్సి ఉంది. అయితే సముద్రం దాటి వెళ్లేందుకు ఎలాంటి రవాణా సదుపాయం లేకపోవడంతో తన బాధను అధికారులతో పంచుకొన్నాడు. సంద్రబాబు బాధను తెలుసుకొన్న కేరళ స్టేట్ వాటర్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం అధికారులు ఏకంగా70 సీట్లున్న బోటును నడిపారు. పరీక్ష రాసేంత వరకు బోటును అక్కడే ఉంచి పరీక్ష పూర్తవగానే ఇంటి వద్ద దింపేవారు. ఇలా రెండు రోజులపాటు సేవలందించారు. దాంతో సదరు విద్యార్థి కొట్టాయం జిల్లాలోని కంజీరం పట్టణానికి వెళ్లి పరీక్షలు రాయగలిగాడు. మన దేశంలోనే సముద్ర మట్టానికి అతి తక్కువ ఎత్తులో కుట్టనాడ్ ద్వీపకల్పం ఉన్నది. సముద్ర మట్టానికి 1.2 మీటర్ల నుంచి 3.0 మీటర్ల ఎత్తు వరకు వ్యవసాయం చేసే ప్రపంచంలోని ప్రదేశాల్లో కుట్టినాడ్ కూడా ఒకటి. ఒక బాలిక పరీక్షలు రాసేందుకు ఏకంగా 70 సీట్లున్న బోట్‌ను ఏర్పాటుచేయడం పట్ల కేరళ రవాణా శాఖ మంత్రి ఏకు శశీంద్రన్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి నుంచి సాధారణ రుసుం మాత్రమే వసూలు చేశామని కేఎస్‌డబ్ల్యూటీడీ డైరెక్టర్ షాజీ నాయర్ చెప్పారు. ఇలాఉండగా, త్రిస్సూర్‌లో ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలకు హాజరయ్యేందుకు శ్రీదేవి అనే విద్యార్థి ఏడు కిలోమీటర్లు నడిచి.. ఆక్కడి నుంచి బైక్‌పై, అంబులెన్స్‌లో.. మొత్తం 150 కిలోమీటర్లు ప్రయాణించడం విశేషం.

కేరళలో ఆన్‌లైన్‌లో కొత్త విద్యా సంవత్సరం

లాక్‌డౌన్ నడుమ కేరళలో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైంది. నేడు దాదాపు 45 లక్షల మంది విద్యార్థులు ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యారు. స్టేట్ జనరల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఫస్ట్‌బెల్' పేరుతో విక్టర్స్ చానల్ ద్వారా 1 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఆ

వారం పాటు ఢిల్లీ సరిహద్దుల మూసివేత

అన్ని వాణిజ్య కార్యకలాపాలకు ఓకే

సలహాలు తీసుకున్నాక తుది నిర్ణయం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ,జూన్2(ఆర్ఎన్ఎ): వారం రోజుల పాటు ఢిల్లీ సరిహద్దుల్ని మూసివేస్తున్నట్లు ఆ రాష్ట్ర సీఎం కేజీవ్రాల్ తెలిపారు. సోమవారం నాడాయన మీడియాతో మాట్లాడుతూ అత్యవసర సర్వీసుల మాత్రం మినహాయింపు కల్పించినట్లు చెప్పారు. పౌరుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించిన తర్వాత.. మళ్లీ సరిహద్దులు తెరువాలా లేదా అన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు.ఆటోలు, ఈ-రిక్షాలు, ఇతర వాహనాల్లో ప్రయాణికుల సంఖ్యపై ఉన్న నిబంధనలను ఎత్తివేస్తున్నట్లు చెప్పారు. మార్కెట్లలో షాపులు తెరిచేందుకు సరిబేసి విధానాన్ని ఇన్నాళ్లూ అమలు చేశామని, కానీ ఇప్పుడు అన్ని షాపులను తెరుచుకోవచ్చు అని సీఎం తెలిపారు. బార్బర్ షాపులు, సెలూన్లను తెరవనున్నట్లు చెప్పారు. స్పాలు మాత్రం మూసి ఉంచనున్నారు. అన్నీ దుకాణాలు ఓపెన్ చేసుకోవచ్చని సీఎం అరవింద్ కేజీవ్రాల్ ప్రకటించారు. ఢిల్లీ బోర్డర్లు ఓపెన్ చేయడంపై సిటిజన్ల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామని ఆ తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అన్నీ షాపులు ఓపెన్ చేసినప్పటికీ స్పాలకు మాత్రం పర్మిషన్లు ఇవ్వలేదు. పెరుగుతున్న వైరస్ కేసులు తగ్గడానికి మరింత కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

మేం బోర్డర్లు ఓపెన్ చేస్తే.. దేశవ్యాప్తంగా ప్రజలు ట్రీట్‌మెంట్ కోసం ఢిల్లీకి వస్తారు. ఢిల్లీ హాస్పిటల్ మాత్రం ఢిల్లీ ప్రజలకు మాత్రం రిజర్వ్ చేసి ఉంచారు. అదే సమయంలో ఢిల్లీ అనేది దేశానికి చెందినదే. అందుకని దేశ ప్రజలకు ట్రీట్‌మెంట్ చేయమని ఎలా నిరాకరిం చగలం అని కేజీవ్రాల్ అన్నారు. దేశంలో ప్రస్తుతం 93వేల 322యాక్టివ్ కేసులు ఉన్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ చెప్పింది. భారత్‌లో కరోనా నుంచి కోలుకుంటున్న వారి శాతం 48.18శాతంగా ఉంది. మొత్తం ప్రపంచంలో కరోనా వైరస్ కేసుల సంఖ్య 61 మిలియన్లను దాటింది. సీఎం ఇచ్చిన సమాచారం ప్రకారం.. అక్షుఎఆ- 19పేషెంట్ల బెడ్లు 9వేల 500 ఉన్నాయి. 'ఓ సీఎంగా మీ కుటుంబంలో ఎవరికి ఇన్ఫెక్షన్ సోకినా బెడ్ రెడీగా ఉంటుందని చెప్పగలను. కరోనా వైరస్ సంక్షోభ సమయంలో ఢిల్లీ బోర్డర్ ఓపెన్‌లో ఉంచాలని అనుకుంటున్నాం. మీ అభిప్రా యాలు తెలియజేయండి. శుక్రవారానికి తుది నిర్ణయం తీసుకుంటాం' అని చెప్పారు.

సినీఫక్కీలో ఎటిఎంలో చోరీ

హ్యాకింగ్ టెక్నిక్‌తో 42039 లక్షల దోపిడీ

గుర్‌గ్రాం,జూన్2(ఆర్ఎన్ఎ): హాలీవుడ్ తరహాలో ఏటీఎంలో ఇద్దరు ముసుగు దొంగలు రూ. 42.39 లక్షలు దోచుకుని పరారైన ఘటన గుర్‌గ్రాంలో వెలుగుచూసింది. మే 23న సుశాంత్‌లోక్ ప్రాంతంలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ దోపిడీకి సంబంధించి నిందితులను పోలీసులు ఇంతవరకూ గుర్తించలేదు. ఈ ఏటీఎంలో మే 20న రూ. 28 లక్షల నగదు నింపారని, మూడు రోజుల తర్వాత సాంకేతిక సమస్యలతో మెషిన్ పనిచేయడం లేదని ఫిర్యాదు రావడంతో నగదు నిర్వహణ సంస్థ సిబ్బంది తనిఖీ చేయడంతో దోపిడీ గుట్టు రట్టయింది. ఏటీఎం నుంచి రూ. 42.39 లక్షలు చోరీ అయ్యాయని గుర్తించామని కంపెనీ ప్రతినిధి గిరీష్ పాల్ సింగ్ చెప్పారు. ఏటీఎంలోని సీసీటీవీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించగా మే 23 రాత్రి 2.30 గంటల సమయంలో ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు ఏటీఎం కియోస్క్‌కు చేరుకుని కెమెరా లెన్స్‌ను తొలగించినట్టు కనిపించిందని అన్నారు. ఏటీఎంను గ్యాస్ కట్టర్ ఉపయోగించి నిందితులు తెరవలేదని, హ్యాకింగ్ పరికరం ద్వారా నగదును దొంగిలించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసులో ఇంటిదొంగల పాత్ర ఏమైనా ఉందా అనే కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు.

త్వరలోనే తిరుమల శ్రీవారి దర్శన భాగ్యం

టిటిడికి అనుమతించిన ప్రభుత్వం

భౌతిక దూరం పాటించాలే చర్యలకు ఆదేశం

తిరుమల,జూన్2(ఆర్ఎన్ఎ): శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి ఎట్టకేలకు ఆమోదం లభించింది. స్వామి దర్శనానికి భక్తులకు అనుమతినిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా... కరోనా, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో... సుదీర్ఘ విరామానంతరం స్వామివాని దర్శనానికి గాను భక్తులకు అనుమతించిన నేపథ్యంలో...

ముందుగా టీటీడీ ఉద్యోగులు, స్థానికులతో ట్రయల్ రన్ నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇక భక్తులు ఖచ్చితంగా ఆరు అడుగుల భౌతిక దూరాన్ని పాటించాల్సి ఉంటుంది. భక్తుల దర్శనానికి గాను అనుమతించాలని కోరుతూ టీటీడీ ఎగ్జిక్యూటివ్ అధికారి రాసిన లేఖ నేపథ్యంలో స్పందించిన ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాద్... అందుకు అనుమతిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కరోనా వైరస్ కారణంగా రెండు నెలలకు పైగా మూతపడ్డ తిరుమల తిరుపతి దేవస్థానం తిరిగి తెరుచుకోనుంది. తిరుమలలో శ్రీవారి దర్శనానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఆరడుగుల భౌతిక దూరం పాటిస్తూ భక్తులకు దర్శనం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే టీటీడీ ఉద్యోగులు, స్థానికులతో ట్రయల్ రన్ నడిపేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు టీటీడీ ఈవో రాసిన లేఖకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దర్శనానికి అనుమతినిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాద్ మంగళవారం ఉత్వర్వులు జారీచేశారు. లాక్‌డౌన్ నిబంధనలను అనుసరిస్తూ శ్రీవారి దర్శనాన్ని కొనసాగించవచ్చని ప్రభుత్వం తెలిపింది. కాగా వైరస్ వ్యాప్తి నేపథ్యలో మార్చి 20 శ్రీవారి దర్శనాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందే.

అమరుల త్యాగఫలమే తెలంగాణ ఏర్పాటు

జెండా ఆవిష్కరణలో మంత్రి ఎర్రబెల్లి

వరంగల్,జూన్2(ఆర్ఎన్ఎ): అమరుల బలిదానాలు, త్యాగాల నిరతి నేటి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణని దేశంలో నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతున్నారని ఎర్రబెల్లి కొనియాడారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ హన్మకొండలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాళులర్పించారు. అనంతరం వరంగల్ రూరల్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి జాతీయ జెండాని ఆవిష్కరించారు. అనంతరం ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ.. రైతుల పంటను తాము కొనబోమని.. చెప్పిన పంటను సాగుచేస్తే జోక్యం చేసుకుంటామని తెలిపారు. రైతులు నియంత్రిత పంటలను వేసి.. లాభసాటిగా మారాలని సూచించారు. వచ్చే వానా కాలం సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబల కుండా జాగ్రత్త పడాలన్నారు. ప్లలె ప్రగతికి కొనసాగింపుగా నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎర్రబెల్లి కోరారు. తెలంగాణని బంగారు తెలంగాణ చేయడానికి పాటు పడుతున్న సీఎం కేసిఆర్, మంత్రి కేటీఆర్‌కులకు కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణిలో పేలుడు

నలుగురు కార్మికుల మృతి

పెద్దపల్లి,జూన్2(ఆర్ఎన్ఎ): సింగరేణి రామగుండం రీజియన్ ఓపెన్ కాస్ట్-1 ప్రాజెక్ట్‌లో భారీ పేలుడు జరిగింది. ఈ ఘటనలో నలుగురు కాంట్రాక్ట్ కార్మికులు మృతి చెందారు. మరో నలుగురికి గాయాల య్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఫేజ్-2 లో బ్లాస్టింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పేలుడు దాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. గాయపడ్డ వారిని వెంటనే గోదావరిఖని ఆస్పత్రికి తరలించారు.



తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేటలో జాతీయ జెండా ఆవిష్కరించిన మంత్రి హరీష్ రావు.

తెలంగాణ ఫలితాలు అందుతున్నాయి

సిద్దిపేటకు గోదావరి జలాలు వచ్చేశాయ్

జెండా ఎగురేసిన మంత్రి హరీష్ రావు

సిద్దిపేట,జూన్2(ఆర్ఎన్ఎ): ఎందుకోసమైతే తెలంగాణ కోసం కొట్లాడామో.. ఆ ఫలితాలు అందుకున్నామని మంత్రి హరీష్ రావు అన్నారు. రాష్ట్రం సాధించుకున్న ఫలాలు ఈ రోజు సిద్దిపేటకు అందాయన్నారు. గోదావరి జలాలు సిద్దిపేటకు అందుతాయని ఆనాడే చెప్పామని.. ఈ రోజు సాదించుకున్నామన్నారు.

నీళ్ళు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణ ఫలాలు ఒక్కొక్కటిగా అందుతున్నాయన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట కలెక్టరేట్‌లో మంత్రి హరీష్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆమరణ దీక్షతో కేంద్రాన్ని ఒప్పించి తెలంగాణ సాధించారని హరీష్‌రావు తెలిపారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ పురోగమిస్తోందన్నారు. ఈ రోజు దేశానికి ఆదర్శంగా తెలంగాణ నిలుస్తోందన్నారు. దేశంలో ఎవరు ఏ పథకాన్ని చేపట్టాయాలన్నా తెలంగాణ వీఐపీ చూస్తున్నాయన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామీణ భారతాన్ని ఈ రోజు ప్లలె ప్రగతి ద్వారా సాధించామన్నారు. పథకాలను చేపట్టడం వాటికి నిధులు ఇవ్వడం, అమలు చేయడం జరిగిందన్నారు. కరోనా లాంటి విపత్తులు వచ్చినా అభివృద్ధిని కొనసాగిస్తూ, సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని హరీష్‌రావు తెలిపారు. ఉద్యమ సందర్భంలో ఏ విధంగా కృషి చేశామో అదే విధంగా రాష్ట్ర అభివృద్ధిలోనూ పని చేస్తున్నామన్నారు. ప్రాజెక్టులకు భూములిచ్చిన నిర్వాసితులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. ఇదే అంకిత భావంతో రాబోయే రోజుల్లోనూ పని చేస్తూ బంగారు తెలంగాణకు కృషి చేస్తామని హరీష్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామలింగారెడ్డి, ఎమ్మెల్సీలు రఘోత్తమ్ రెడ్డి, ఫారూఖ్ హుస్సేన్, జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, సీపీ జోయల్ డేవిస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జలదీక్షలను భగ్నం చేసిన పోలీసులు

ముందుగానే నేతల గృహనిర్భంధం

ఎక్కడికక్కడే నేతల అరెస్టుతో దీక్షలకు బ్రేక

సర్కార్ తీరుపై ఉత్తమ్ తదితరుల ఆగ్రహం

అవతరణ దినోత్సవాన కెసిఆర్ జులుం అంటూ మండిపాటు

హైదరాబాద్,జూన్2(ఆర్ఎన్ఎ): పెండింగ్ ప్రాజెక్ట్‌ల వద్ద కాంగ్రెస్ నేతలు తలపెట్టిన దీక్షలకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ముందస్తు చర్యలో భాగంగా పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసారు. హైదరాబాద్‌లో ఎంపీ కోమటిరెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. అలంపూర్ శాంతినగర్‌లో సంపత్ కుమార్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డిని ఇప్పటికే హౌస్ అరెస్ట్ చేశారు. నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ నేత నాగం జనార్ధన్‌రెడ్డి ఇంటి వద్ద కొద్దిసేపు ఉద్రిక్త చోటు చేసుకుంది. నాగం బయటకు రాకుండా పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. ఆ తరువాత జానర్ధన్‌రెడ్డి హౌస్ అరెస్ట్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయించాలంటూ జలదీక్షకు సిద్ధమైన కాంగ్రెస్ నేతలకు ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. కాంగ్రెస్ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్ట్‌లు చేస్తున్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు రేవంత్ రెడ్డిని కొడంగల్‌లో హౌస్ అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లో ఎంపీ కోమటిరెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. అలంపూర్ శాంతినగర్‌లో సంపత్‌కుమార్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డిని ఇప్పటికే హౌస్ అరెస్ట్ చేశారు. అంతేకాకుండా పొన్నాల లక్ష్మయ్య ఇంటి వద్ద పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించి ఉన్నాయి. అంతేకాకుండా పొన్నాల లక్ష్మయ్య ఇంటి వద్ద పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించి ఆయన బయటకు రాకుండా అడ్డుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో కృష్ణానదిపై పెండింగ్ ప్రాజెక్ట్ వద్ద నిరసన కార్యక్రమాలకు, జలదీక్షలకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. నీళ్లు, నిధులు, నియమకాల ఆకాంక్షలకు అనుగుణంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేయడం లేదని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా నీళ్ల పేరిటి ఉద్యమాన్ని చేసినప్పటికీ అదే నీటి విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, ప్రధానంగా కృష్ణా నదిపై కట్టిన ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టి దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చే కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు విస్తీర్ణాన్ని పెంచి జలాలను తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కేసీఆర్ స్పందించిన తీరు సరిగా లేదంటూ ఈరోజు పెండింగ్ ప్రాజెక్టుల వద్ద నిరసన దీక్షలు చేయాలని నిర్ణయించింది. కాగా ఈ దీక్షలకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అనుమతి నిరాకరించింది. అయినప్పటికీ దీక్షల విషయంలో వెనక్కి తగ్గకపోవడంతో మంగళవారం ఉదయం నుంచే కాంగ్రెస్ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ హౌజ్ అరెస్ట్‌లు చేసారు. అరెస్టులను ఖండిస్తూ తెలంగాణ రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన సాగుతోందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజు కాంగ్రెస్ పార్టీ నేతలను గృహ నిర్భంధం చేయడం అప్రజస్వామికమని ఇంతకమటే దారుణం మరొకటి ఉండదన్నారు. మంగళవారం జలదీక్ష తలపెట్టిన తెలంగాణ కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ పోలీసులు హౌస్ అరెస్టు చేస్తున్నారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌ను కూడా పోలీసులు గృహ నిర్భంధంలో ఉంచారు. దీంతో తెలంగాణ ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుపై ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ పార్టీ నాయకుల ఇళ్ల ముందు నుంచి పోలీసులు వెంటనే వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా తాము చేసుకునే కార్యక్రమాలను అడ్డుకోకూడదని ఉత్తమ్ అన్నారు. మాట్లాడితే అరెస్టులు చేయడం పాశవిక పాలనకు పరాకాష్ట అని, ఇందుకోసమేనా తెలంగాణ తెచ్చుకుంది అని ప్రశ్నించారు. ఆవిర్భావ దినోత్సవం రోజు హక్కులు కాలరాస్తే ఎలా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో ఒక నియంత, అసమర్థత పాలన సాగుతోందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నేతల హౌస్ అరెస్ట్‌లను కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఖండించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) దగ్గర దీక్షా కార్యక్రమం రద్దు చేసుకొని సందర్శనకు మాత్రమే వెళదామని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆవిర్భావ దినోత్సవం రోజు ఇళ్ల ముందు నేతలను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కేసీఆర్ నియంత పోకడలకు ఈ అరెస్ట్‌లు నిదర్శనమన్నారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున కాంగ్రెస్ పార్టీ జలదీక్షకు సిద్ధమైన విషయం తెలిసిందే.

మెరుగైన సేవల కోసమే రైతుబందు సమితులు

వ్యవసాయ రంగంలో కీలకం కాబోతున్న ఆధునిక వ్యవస్థ

హైదరాబాద్,జూన్2(ఆర్ఎన్ఎ):నిజానికి వ్యవసాయరంగం సంక్షోభంలో ఉంది. ఇప్పటికీ కూలీల సమస్య ఉంది. కరెంట్ సమస్య తీరినా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఎరువులు పుర్రుగు మందుల ధరలతో కుదేలవుతున్నారు. ఈ దశలో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని పదేపదే సీఎం కోరుతున్నారు. దీనిపై ఇప్పటికే ప్రధాని దృష్టికి పలుమార్లు తీసుకుని వచ్చారు. ఇంతకాలం దేశంలో కార్పోరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నా, బ్యాంకులు లూటీ అవుతున్నా అన్నదాతలను మాత్రం ఆదుకున్న దాఖలాలు లేవు. ఉద్యోగులకు డిఎలు పెరుగతాయి కానీ అన్నదాతలకు పైసా విదిల్చిన దాఖలాలు లేవు. కానీ తెలంగాణలో సిఎం కెసిఆర్ మాత్రం ఓ పక్కా ప్రణాళికతో రైతుల బాగుకోసం తీసుకుంటున్న చర్యలు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగించేవిగా ఉన్నాయి.

రైతులను చల్లగా చూసుకుంటేనే మనం ముద్ద తినగలుగుతాం. ఇది ఎన్నో ఏళ్లుగా అందరూ చెబుతున్నదే.

ఆచరణలో చేసి చూపడంలో మాత్రం అందరూ విఫలం అయ్యారు. అన్నదాత అంటూ కీర్తిస్తూ..దేశానికి వెన్నముక అంటూ పొగడడమే తప్ప మరోటి జరగడం లేదు. వ్యవసాయరంగంపై ఆయన దార్శనికత కనిపిస్తుంది. భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో రావాల్సిన సాంకేతిక మార్పులతో సహా ఆర్థిక సాయం, పంటల కొనుగోళ్లు తదితర అంశాలపై ప్రకటించిన వివరాలు అన్నదాతకు భరోసా కలిగించేలా ఉన్నాయి. అలాగే రైతు సమన్వయ సమితుల ద్వారానే పంటల కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లోనే నేరుగా కొనేలా లాక్‌డౌన్ నేథ్యంలో నిర్ణయాలు తీసుకున్నారు. అటవీశాఖ సహకారంతో కోతులు, అడవి పందుల బెడద తగ్గిస్తం. సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. భవిష్యత్ తరాల కోసం మనం ఆలోచించాలని అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ జరిగితే తప్ప అనుకున్నది సాధించలేమని కూడా అన్నారు. ఎక్కడ ఏ యంత్రాలు సమకూర్చాలో ప్రభుత్వం నిర్ణయించడంతో పాటు, అందరూ ఒకటే పంట వేస్తే అందరికీ నష్టం గునక పంటలు ఎప్పుడెలా ఎక్కడ ఎలా వేయాలో కూడా నిర్ణయిస్తామని అన్నారు. అధికారులు సూచించిన ప్రకారం పంటలు పండిస్తే రైతులకు లాభం చేకూరుతుంది.

ప్రతి నియోజకవర్గానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం దూరదృష్టికి నిదర్శనంగా చెప్పుకోవాలి..మార్కెట్ తెచ్చే ధాన్యంలో తేమ శాతం తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. పంటను ఒకే సారి మార్కెట్‌కు తరలించకుండా చూసుకోవాలి.

ప్రతి గ్రామ రైతులకు ఒక నిర్ణీత రోజు, సమయం కేటాయించాలి. వచ్చే వర్షాకాలపు పంట ఒక్క గింజ కూడా కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్మనివొద్దు. గిట్టుబాటు ధర రావాలంటే అది రైతుల చేతిలోనే ఉంది. నిమిషాల మీద కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారు. చెక్కుల పంపిణీలో క్రమశిక్షణ పాటించిన గ్రామాల రైతులను ఇజ్రాయెల్ పంపేందుకు ఏర్పాట్లు చేసారు. స్థానికంగా ఎక్కడ ఏ పంటలు పండుతాయో అక్కడ వాటికి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అంకాపూర్ గ్రామాన్ని సమన్వయ సమితి సభ్యులంతా సందర్శించారు.

కల్తీ విత్తనాలపై ఉక్కుపాదం మోపారు. రైతులకు కరెంట్, నీళ్లు, పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు అన్ని ఇస్తున్నట్లు ప్రటకించారు. రాష్ట్రంలో కోటి 65 లక్షల ఎకరాల వ్యవసాయ నికర భూమి తేలింది. కోటి 32 లక్షల భూమి ఏ పంచాయతీ లేకుండా ఉన్నది. రైతులను ఆర్గనైజ్ చేయడం వల్ల చాలా విజయాలు సాధిస్తామని అన్నారు. రైతులు వ్యవస్థీకృతమే పంట కాలనీలు కూడా సాధ్యమే. రైతులంతా ఐక్యంగా ఉంటే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చన్నారు. రైతులు బాగుపడేందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి అండగా నిలవాలి. రైతులు కూడా తమ భవిష్యత్ కోసం పంటలను వేయడం మొదలు, పురుగుమందులు వాడడం, అమ్మకాల వరకు తగుజాగ్రత్తలు పాటించాలి. అప్పుడే వ్యవసాయం పండగగా మారగలదు.

కాంగ్రెస్ నేతల అరెస్ట్ అప్రజాస్వామికం

గవర్నరకు ఫోన్‌లో వివరించిన ఉత్తమ్

గాంధీభవన్‌లో అవతరణ వేడుకల్లో జెండా ఆవిష్కరణ

తెలంగాణలో ఇవాళ బ్లాక్‌డే అన్న కోమటిరెడ్డి

హైదరాబాద్/నల్గొండ,జూన్2(ఆర్ఎన్ఎ): తమను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై.. సంఘటనా స్థలం నుంచే కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఫోన్‌లో గవర్నర్ తమిళిసై దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి కారణాలు లేకుండా.. ఎమ్మెల్యేలు, ఎంపీలను అరెస్టు చేస్తున్నారని గవర్నర్‌కు తెలిపారు. పోలీసులు, ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గవర్నర్‌ని కలిసి అన్ని విషయాలు వివరిస్తామని ఉత్తమ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే గాంధీభవన్‌లో నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అన్యాయం జరిగిందని చెప్పిన నేతలు.. ఇప్పుడు నియంత పాలన సాగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. గత ఆరేండ్లలో రాష్ట్రంలో నిరుద్యోగులు పెరిగిపోయారన్నారు. కాంగ్రెస్ చేపట్టిన ప్రాజెక్టులన్నీ పెండింగులో ఉన్నాయని ఆయన అన్నారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారని ఆయన ఆరోపించారు. పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా జలాలను తరలిస్తున్నా.. కేసీఆర్ మాట్లాడటం లేదని ఉత్తమ్ మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్తున్న నల్గొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డిని నల్లగొండ జిల్లా మాల్ వద్ద చింతపల్లి పోలీసులు అరెస్టు చేశారు. దీంతో పోలీసుల వైఖరిని నిరసిస్తూ కోమటిరెడ్డి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి కృషి చేసింది కాంగ్రెస్ అయితే ప్రస్తుతం రాష్ట్రంలో దొరల పాలన కొనసాగుతుందని ధ్వజమెత్తారు. కుర్చీ వేసుకొని ప్రాజెక్టును పూర్తి చేస్తా అని ఎన్నికల్లో చెప్పిన కేసీఆర్.. ఇప్పుడెందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. మేధావిలా మాట్లాడుతున్న కేసీఆర్ ఒక నియంత అని దుయ్యబట్టారు. కాగా మంగళవారం తెలంగాణ కాంగ్రెస్ నేతలు జలదీక్ష తలపెట్టిన విషయం తెలిసిందే. సొంత జిల్లాకు వెళ్లకుండా ప్రజాప్రతినిధులను అడ్డుకోవడాన్ని కోమటిరెడ్డి ఖండించారు. ముఖ్యమంత్రి కావాలనే నేతలను అవమానపరుస్తున్నారు. ఈ రోజు ఆవిర్భావ దినోత్సవం కాదు బ్లాక్ డే అంటూ విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో తెలంగాణలో దోపిడీ జరుగుతుందని ఆరోపించారు. కరోనా నిబంధనల పేరుతో పోలీసులు ఇబ్బంది పెడుతున్నారన్నారు. దేవరకొండ కాంగ్రెస్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం చేసుకోవడానికి అనుమతి ఇవ్వడంలేదని, కేసీఆర్ హిట్లర్ కంటే ఎక్కువ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నయవంచకుడి మోసానికి బలైన కన్నడ నటి

ప్రేమపేరుతో పెళ్లి చేసుకోకుండా మోసం

సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యకు పాల్పడ్డ చందన



బెంగళూరు,జూన్2(ఆర్ఎన్ఎ): ఎన్నో కలలతో పల్లె వదిలి పట్నానికి వచ్చి, సినిమాల్లో తారగా వెలుగొందాలని కలలుకంది. ఇంతలో ఓ వంచకుడు తీయని మాటలతో వలవేసి ఐదేళ్లు మోజు తీర్చుకున్నాడు. తీరా పెళ్లి చేసుకోమని అడిగేసరికి ముఖం చాటేయడంతో ఆ అభాగ్యురాలు విషాన్ని ఆశ్రయించింది. కన్నడ టీవీ నటి చందన (29) నిజ జీవితం విషాదాంతమైంది. పురుగుల మందు తాగిన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. హాసన్ జిల్లా బేలూరుకు చెందిన చందన సినిమాల్లో నటించాలని బెంగళూరుకు వచ్చింది. కన్నడ బుల్లితెరతో పాటు పలు ప్రకటనలు, సినిమాలో చిన్నచిన్న పాత్రల్లో ఆమె నటించింది. పురుగుల మందు తాగడాన్ని

కరువు నేలలో గోదావరి జలాలను పారించిన ఘనత సీఎం కేసీఆర్ దే

సూర్యాపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అమరులకు నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్వర్‌రెడ్డి.

సూర్యాపేట, జూన్ 2 : ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిలో అగ్రభాగాన నిలిచిందని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. జిల్లాలో తెలంగాణా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్నిఘనంగా నిర్వహించారు.

సూర్యాపేటలో మంత్రి జగదీష్ రెడ్డి తెలంగాణా తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి, అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 20 సార్లకు పైగా సీఎం కేసీఆర్ జిల్లాలో పర్యటనలు చేసి అభివృద్ధి చేశారని తెలిపారు. సూర్యాపేట జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన గోదావరి జలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు. గోదావరి జలాలతో జిల్లాలో వ్యవసాయం పండుగలా మారిందన్నారు.

ఒకప్పుడు కరువు కాటకాలతో, వలస పోయిన ప్రజలు నేడు సంతోషంగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ , మల్కాపూర్ ఇండస్ట్రియల్ పార్క్, యాదాద్రి ఆలయ అభివృద్ధి, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, ఎయిమ్స్, రెండు మెడికల్ కాలేజీల ఏర్పాటు, సాగర్ ఆయకట్టులోని చివరి భూములకు సాగు నీరు అందించడం, ఇలా పలు అభివృద్ధి పనులు చేపట్టి సీఎం కేసీఆర్ ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారని మంత్రి తెలిపారు.

ఉద్యమంలో సకలజనుల సమ్మె అద్భుత ఘట్టం

ఉద్యమనేత కెసిఆర్ నాయకత్వంలో పోరాట ఫలితమే తెలంగాణ జాతీయ జెండాను అవిష్కరించిన కారెం రవీందర్ రెడ్డి

హైదరాబాద్,జూన్2(ఆర్ఎన్ఎ): నాటి ఉద్యమ నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు పోరాట పటిమ, ఆయన ఆమరణ నిరాహార దీక్ష, ఉద్యోగుల సహాయ నిరాకరణ, చారిత్రాత్మక సకల జనుల సమ్మె వంటి అద్భుతమైన పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ జరిగిందని ఉద్యోగ నేతలు స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా టీఎన్జీవో భవన్ వద్ద టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవిందర్ రెడ్డి జాతీయ జండాను ఆవిష్కరించారు. అనంతరం... గన్ పార్కు లోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, అసోసియేట్ అధ్యక్షురాలు బండారు రేచల్, కోశాధికారి రామినేని శ్రీనివాస్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శులు నజీర్, ఉమాదేవి, హైదరాబాదు జిల్లా అధ్యక్షుడు ముజీబ్, కార్యదర్శి ప్రభాకర్, హైదరాబాదు నగర అధ్యక్షుడు రాయికంటి ప్రతాప్, కార్యదర్శి శ్రీకాంత్, టీఎన్జీవో నేతలు శ్రీరాం, శ్రీనివాస్ గౌడ్, ప్రశాంతి, నాగిరెడ్డి, వినోద్ , హరిక్రిష్ణ వరలక్ష్మి, నాల్గవతరగతి ఉద్యోగుల సంఘం నేతలు గడ్డం జ్ఞానేశ్వర్, ఖాదర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. టీఎన్జీవో సంఘం సుదీర్ఘ పోరాటం, ఆచార్య జయశంకర్ చెప్పిన విధంగా రాష్ట్ర ఏర్పాటు మాత్రమే లక్ష్యంగా కాకుండా ఆతర్వాత రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా మన ఆలోచన సాగాలని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ఆరు సంవత్సరాల పాలనలో తెలంగాణ రాష్ట్రం... విద్య, విద్యుత్తు, వైద్యం, వ్యవసాయం వంటి ప్రధానమైన అంశాలతో పాటు అనేక రంగాలలో సాధించిన ప్రగతి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఉద్యోగులు అన్ని స్థాయుల్లో పదోన్నతులు పొందారని, పంచాయితిరాజ్ శాఖలో సంవత్సరానికి ఒక ప్రమోషన్ పొందారని వెల్లడించారు. పంచాయతీ రాజ్, వ్యవసాయం, విద్యుత్తు , నీటిపారుదల తదితర శాఖలలో అనేక పోస్టుల భర్తీ జరిగిందన్నారు. మిగిలిన పోస్టుల భర్తీ కూడా త్వరలో పూర్తికావాలని కోరుకుంటున్నామన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీ, రిటైర్మెంటు వయస్సు పెంపు, ఆంధ్రాలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కి రప్పించే అంశాలకు సంబంధించి త్వరలో ముఖ్యమంత్రిని కలవనున్నట్లు వెల్లడించారు.

ప్రతి పోరులో పాత్రికేయులదే తొలి అడుగు

జర్నలిస్టు సంఘాల నేతలు

వేములవాడ, జూన్ 2(నేటినిజం ప్రతినిధి): స్వాతంత్ర పోరాటం నుండి నేటి ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం వరకు పోరాట రంగంలో ఎందరో వీరులు కదం తొక్కినా ఆ పోరును ఉధృతం చేసేలా తొలి కీలకమన్నారు .ఈ ఉద్యమంలో మన రాష్ట్ర సాధనలో అన్న కోణంలో జర్నలిస్ట్ చేసిన పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. స్వరాష్ట్రం ఏర్పడిన జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాజీలేని పోరాటం తప్పదని టీయూడబ్ల్యూజే (ఐజేయూ)రాష్ట్ర నాయకులు రేగుల దేవేందర్

అడుగు చేసింది మాత్రం పాత్రికేయ లేనని, కానీ పాత్రికేయుల సమస్యల ను మాత్రం ఇప్పటికీ సాధించుకో లేక పోతున్నాను అంటే ప్రభుత్వాలకు పాత్రికేయులపై ఉన్న శ్రద్ధ ఎంతో తెలుస్తుందని పాత్రికేయ సంఘాల నేతలు పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని జర్నలిస్టు సంఘాల నేతలు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, అలుపెరుగని పోరాటం చేసిన జర్నలిస్టుల కృషితోనే రాష్ట్ర సాధన సాధ్యమైందని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన జర్నలిస్టుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని సమస్యలను పరిష్కరించకుంటే వేములవాడ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కిషన్ అన్నారు

మంగళవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరవీరుల స్థూపం వద్ద వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నల్లా మాస్కులు ధరించి , భౌతిక దూరాన్ని పాటిస్తూ తెలంగాణ ఉద్యమంలో అమరులకు,కరోనాతో బలైన ప్రజలకు నివాళ్లు అర్పిస్తూ నే తమ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నాయకులు రేగుల దేవేందర్ ,ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కిషన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టు పాత్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వైఖరి జర్నలిస్టులకు ఆందోళన కలిగిస్తుంది అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జర్నలిస్టు పొందిన సౌకర్యాలను నేడు పొందలేని దారుణ పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి దేవేందర్ , ,ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పారువెల్లి శ్రీనివాస్ ,కోశాధికారి గడిల ప్రవీణ్ , ,సీనియర్ జర్నలిస్టు గోయి కారి శ్రీనివాస్ ,ఎం.ఎ. మన్నాన్, పంపరి శంకర్ ,చంద్రశేఖర్ , రవి ,మల్లేశం ,హైమద్ పాషా ,కలీం పాషా, హబీబ్ పాషా , మ్యాన శ్రీనివాస్ ,దూలం సంపత్ ఖాజా సయిమొద్దీన్ ,నవాబ్ ఖాన్ ,తదితరులు పాల్గొన్నారు

వేములవాడలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

వేములవాడ, జూన్ 2(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి . అన్ని వర్గాల ప్రజలు సైతం ఈ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు గ్రామాల్లో యువజన సంఘాల వార్డుల ప్రజలు జెండా ఎగరవేసి వేడుకలు నిర్వహించుకున్నారు .పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ చంద్రకాంత్ , మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి , అర్బన్, రూరల్ మండల పరిషత్,తసీల్దార్ కార్యాలయంలో ఎంపిపిలు బుర్ర వజ్రమ్మ ,బండ మల్లేశం యాదవ్ , శ్రీనివాస్ , మునీందర్ ,శ్రీ రాజేశ్వరస్వామి దేవస్థానం కార్యాలయంలో ఏవో ఉమారాణి , టౌన్ ,రూరల్ పోలీస్ స్టేషన్లలో సిఐలు వెంకటేశం ,నవీన్ , అర్బన్ ,రూరల్ సెస్ కార్యాలయాల్లో డైరెక్టర్లు రామతీర్థ రాజు ,జడల శ్రీనివాస్ , వ్యవసాయ మార్కెట్ కమిటీలో కార్యాలయంలో కార్యదర్శి ,సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రర్ అధికారి ఎజాస్ జెండాలు ఎగరవేస్తి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు

అసోంలో కొండచరియలు విరిగిపడి 20మంది మృతి

ఘటనలపై సిఎం సోనోవాల్ తీవ్ర దిగ్భ్రాంతి

డిస్‌పూర్,జూన్2(ఆర్ఎన్ఎ): అసోంలో కొండచరియలు విరిగిపడి 20 మంది మృతిచెందారు. మూడు వేర్వేరు చోట్ల మంగళవారం జరిగిన ఈ ప్రమాదాల్లో 20 మంది మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని కరీమ్‌గంజ్ జిల్లాలోని కలియాగంజ్‌లో కొండచరియలు విరిగిపడి ఆరుగురు, కాచర్ జిల్లాలో జరిగిన ప్రమాదంలో ఏడుగురు, హైలాకాండి జిల్లాలో ఏడుగురు చనిపోయారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కరోనాకు మరో పోలీస్ బలి

మహారాష్ట్రలో ఆగని ఉధృతి

ముంబై,జూన్2(ఆర్ఎన్ఎ): కరోనా కారణంగా ముంబైలో మరో పోలీస్ అధికారి మరణించారు. ముంబైలో వైరస్ సంక్రమణకు గురైన మొత్తం పోలీసు సిబ్బంది సంఖ్య 19, మహారాష్ట్రలో మొత్తం 29 కి చేరుకున్నట్లు ఒక ఉన్నతాధికారి తెలిపారు. ఈ అసిస్టెంట్ సబ్-ఇన్స్పెక్టర్ సియోన్ ఆసుపత్రిలో గత వారం కరోనా పాజిటివ్‌తో చికిత్స కోసం చేరారు. 'శాంటాక్రూజ్ పోలీస్ స్టేషన్ జనరల్ డిపార్టుమెంటుకు అనుబంధంగా ఉన్న ఎఎస్ఐ ఈ రోజు కరోనా వైరస్ సంక్రమణ కారణంగా మరణించారు' అని శాంటాక్రూజ్ పోలీస్ స్టేషన్ సీనియర్ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ కోరెగావ్కర్ చెప్పారు. మృతుడు ముంబైలోని కంటెమెంట్ జోన్లలో ఒకటైన ధారవి-కోలివాడ నివాసి అని అధికారులు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దోపిడీ దొంగల దాడిలో మహిళ మృతి

తిరువనంతపురం,జూన్2(ఆర్ఎన్ఎ): దోపిడీ దొంగలుగా భావిస్తున్న వ్యక్తులు వృద్ధ దంపతులపై దాడికి తెగబడటంతో 55 ఏళ్ల మహిళ మరణించిన ఘటన కేరళలోని కొట్టాయం వద్ద తజతంగడిలో వెలుగుచూసింది. గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల ఫిర్యాదుతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసలకు రక్తపు మడుగులో ఎలక్ట్రిక్ వైర్లతో కట్టిపడేసిన దంపతులు కనిపించారు. మహిళ విగతజీవిగా పడిఉండగా, అక్కడే ఆమె భర్త అచేతన స్థితిలో కనిపించారు. పదునైన ఆయుధాలతో దుండగులు దాడిచేయడంతో ఇరువురి తలపై తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. కారుతో సహా విలువైన వస్తువులు మాయమయ్యాయని చెప్పారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైతువేదిక నిర్మాణానికి భారీ విరాళం

ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి వెల్లడి

మెదక్,జూన్2(ఆర్ఎన్ఎ): రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికల నిర్మాణానికి సంకల్పించారు. ఈ బృహత్తరమైన కార్యక్రమానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. ప్రభుత్వ కృషికి తోడు తమ వంతు సహకారం అందించేందుకు దాతలు ముందుకొస్తున్నారు. జిల్లాలోని రామాయంపేటలో రైతు వేదిక భవన నిర్మాణానికి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కాగా, ఈ భవన నిర్మాణానికి అయ్యే ఖర్చును మంత్రి కేటీఆర్ భార్య శైలిమ తాత గారైన దివంగత నూలి హనుమంతరావు పేరిట వారి కుటుంబీకులు ఆర్థిక సహాయం చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించే ఈ భవనాన్నినెల రోజుల్లో పూర్తి చేస్తామని, ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్ రానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఆన్‌లైన్ తరగతులకు హాజరు కాలేకపోతున్నానని బాలిక ఆత్మహత్య

తిరువనంతపురం, జూన్ 2 : ఆన్‌లైన్ తరగతులకు హాజరుకాలేకపోతున్నానని మనస్థాపం చెందిన ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద సంఘటన కేరళలోని మలప్పురం జిల్లాలో చోటు చేసుకుంది. షెడ్యూల్ క్యాస్ట్‌కు చెందిన 9వ తరగతి చదువుతున్న బాలిక ఆన్‌లైన్ తరగతులను యాక్సెస్ చేయలేకపోతున్నానని మనస్థాపం చెంది శరీరానికి నిప్పంటించుకుని మృతిచెందింది. రోజువారి కూలీపని చేసుకొని బ్రతికే మృతురాలి తండ్రి స్పందిస్తూ... ఇంట్లో టీవీ ఉంది. అది పని చేయడం లేదు. దాన్ని రిపేర్ చేయించమని అడిగింది. కానీ నేను చేయించలేకపోయా. ప్రస్తుతానికి స్నేహితుల ఇంటికి వెళ్లి క్లాసులు వినే ఆప్షన్‌ను చూసుకుందామని చెప్పా. అయినా ఇంతటి అఘాయిత్యానికి ఎందుకు పాల్పడిందో అర్థం కావడం లేదు. ఘటనపై సీనియర్ పోలీసు అధికారి ఒకరు మాట్లాడుతూ... బాధిత కుటుంబం చాలా పేదది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన చదువు కొనసాగదని బాలిక భావించి ఉంటుంది. లేదా తన పై చదువులు కొనసాగవని అనుకుంది. ప్రాథమికంగా మాత్రం ఆన్‌లైన్ తరగతులకు హాజరుకాలేకపోతున్నానని బాలిక మనస్థాపం చెందిందన్నారు. బాలిక విషాద ఘటనపై ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సి.రవీంద్రనాథ్ జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి నివేదిక కోరారు.

వావ్ వరంగల్ సింబల్ ఆవిష్కరణ

వరంగల్,జూన్2(ఆర్ఎన్ఎ): కళల కాణాచిగా పేరుగాంచిన వరంగల్ నగరాన్నిమరింతగా అభివృద్ధి పరిచి 'వావ్ వరంగల్' అనేలా చేస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధి లోని ఫాతిమా జంక్షన్ లో హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పై ఉన్న లవ్ హైదరాబాద్ తరహాలో..వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకంగా రూపొందించిన 'వావ్ వరంగల్' చిహ్నాన్ని మంత్రి ఎర్రబెల్లి, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వరంగల్ అంటే ఓ చరిత్ర, వరంగల్ అంటే అభివృద్ధికి, సంస్కృతికి, గొలుసు కట్టు చెరువులకు, సహజ సిద్ధమైన రిజర్వాయర్లకు ఓ ఐకాన్ అన్నారు. ఈ ఒరవడిని కొనసాగిస్తూనే జిల్లాకు మరింత వన్నె తెచ్చేలా కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ వరంగల్ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తున్నారని మంత్రి తెలిపారు. త్వరలో అవుటర్ రింగ్ రోడ్డు పూర్తయితే జిల్లాకు మరిన్ని పరిశ్రమలు రావడానికి ఆస్కారం ఉందన్నారు.

కేసీఆర్‌కు ఆదిలాబాద్ ఆపిల్

ప్రగతిభవన్‌లో అందచేసిన రైతు బాలాజీ

హైదరాబాద్,జూన్2(ఆర్ఎన్ఎ): తెలంగాణలో తొలిసారి ఆపిల్ పండ్లు పండించిన కొమురం భీం జిల్లా రైతు కేంద్రె బాలాజీ తొలి కాతను మంగళవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కెసిఆర్‌కు అందించారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రికి మొక్కను, పండ్ల బుట్టను అందించి శుభాకాంక్షలు తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం ధనోరా గ్రామంలో 2 ఎకరాల్లో హెచ్ఆర్ 99 ఆపిల్ పంటను సాగుచేసినట్లు బాలాజీ తెలిపారు. ఉద్యానవన శాఖ పంట సాగులో ఎనలేని సహకారాన్ని అందించిందని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రోత్సాహంతో ఆపిల్ పంట సాగు పై మరింతగా దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ బాలాజీని అభినందించారు. తెలంగాణ నేలల విభిన్న రకాల స్వభావం కలిగినవి చెప్పడానికి ఇక్కడి నేలల్లో ఆపిల్ పండ్లు పండడమే ఉదాహరణ అన్నారు.

దేశంలో 2లక్షలకు చేరువలో కరోనా బాధితుల సంఖ్య

న్యూఢిల్లీ,జూన్2(ఆర్ఎన్ఎ): భారత్‌లో కరోనా కేసుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతూనే ఉంది. లాక్‌డౌన్ ఆంక్షల సడలింపుల తర్వాత వైరస్ విజృంభిస్తోంది. దేశంలో కరోనా బాధితుల సంఖ్య 2లక్షలకు చేరువలో ఉంది. తాజాగా 24 గంటల్లో కొత్తగా 8,171 మంది కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యారు.

దీంతో మొత్తం కేసుల సంఖ్య 198,706 కు పెరిగింది. గడచిన 24 గంటల్లో మరో 204 మంది చనిపోవడంతో మొత్తం కరోనా మరణాల సంఖ్య 5,598కు చేరింది. ప్రస్తుతం దేశంలో 198,706 మంది బాధితులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు కరోనా నుంచి కోలుకొని 95,526 డిశ్చార్జ్ అయ్యారు. మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాల్లో కరోనా తీవ్రత ఎక్కువగా ఉంది. ఢిల్లీలో మరణాలు గణనీయంగా పెరిగాయి.

ఇదిలావుంటే కరోనాకు వ్యాక్సిన్ సిద్ధమయ్యే వరకు గానీ, దేశంలో పరిస్థితి మెరుగు పడే వరకు గానీ పాఠశాలలు పునఃప్రారంభించొద్దని కేంద్రానికి 2.13 లక్షల మంది తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఒక పిటిషన్‌పై వారు సంతకాలు చేశారు. విద్యా సంస్థలను తెరిచే అంశంపై జూలైలో నిర్ణయం తీసుకుంటామని కేంద్రం ప్రకటించింది. జూలైలో విద్యా సంస్థలు తెరిస్తే పరిస్థితి దారుణమవుతుందని తల్లిదండ్రులు ఆ పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేశారు.

గోదావరి నీళ్లు వస్తున్నాయో లేదో వచ్చి చూస్తే తెలుస్తుంది

ఉత్తమ్ విమర్శలమై మండిపడ్డి హరీష్ రావు

సిద్దిపేట,జూన్2(ఆర్ఎన్ఎ): పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఒక్క ఎకరానికి కూడా నీళ్లు రాలేదన్న ఉత్తమ్ వ్యాఖ్యలపై మంత్రి మండిపడ్డారు. గాంధీభవన్‌లో కూర్చుంటే కాళేశ్వరం నీళ్లు కనపడవు. నిండుతున్న చెరువులు,

పండుతున్న పంటలు వాస్తవం కాదా?, రైతులను కలిసి నీళ్లొచ్చాయో? రాలేదో ? ఒక్కసారి చూసి మాట్లాడితే మంచిదన్నారు. కాళేశ్వరం ఫలితమే సూర్యాపేటకు, వరంగల్‌కు నీళ్లు అని అన్నారు. గోదావరి ఉప్పెనలాగా పంట కాలువలు, పిల్ల కాలువలు, మైనర్ కెనాల్స్, డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్‌లో అద్భుతంగా ప్రవహిస్తోంది. లక్షలాది మంది ప్రతిరోజు చూస్తున్నారు. పత్రికల్లో పతాక శీర్షికల్లో వస్తున్నాయి.

ఇది మీకు తెలియదా? లేక తెలిసి ఉద్దేశపూర్వకంగా మాట్లాడ్తున్నారా ? అని ప్రశ్నించారు. పారుతున్న నీళ్లు వాస్తవం కాదా?, నిండుతున్న చెరువులు వాస్తవం కాదా?, పండుతున్న పంట వాస్తవం కాదా ? అని అన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలి. వాస్తవాలు మాట్లాడాలి. అప్పుడే విశ్వసనీయత పెరుగుతుంది. అసెంబ్లీలో చెప్పిన మేరకు రుణమాఫీ అమలు జరుగుతోంది. 1200 కోట్లు ఇప్పటికే ఆర్థిక శాఖ విడుదల చేసింది. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నది మీకు కనిపించడం లేదా?, తెలంగాణ ఆవిర్భావ ఫలితం ఈ రోజు దుబ్బాకకు అందుతున్నదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఆరు వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్ నియోజకవర్గంలోని అశోక్‌నగర్ స్ట్రీట్ నెం. 7 జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్.

జర్నలిస్టులకు కరోనా సాయం అందించాలి

ప్రభుత్వానికి హైకోర్టు సూచన

హైదరాబాద్,జూన్2(ఆర్ఎన్ఎ): ప్రాణాలను ఫణంగా పెట్టి కరోనా వార్తలను కవర్ చేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని హైకోర్టు సూచించింది. కరోనా వైరస్ పై ప్రజలకు అవగాహన కల్పించడం లో జర్నలిస్టుల సేవలు మారవలేమంది. కరోనా పై ప్రత్యక్ష పోరాటం చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవాలంటూ హైకోర్టులో లాయర్ రాపోలు భాస్కర్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం హైకోర్టు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించారు. ఈ పిటిషన్ పై సీనియర్ న్యాయవాది మాచర్ల రంగయ్య తన వాదనలను విన్పించారు. లాక్‌డౌన్ సమయంలో ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని పిటిషనర్ తరపున కోరారు.రాష్ట్రంలో ఉన్న ప్రతి జర్నలిస్టుకు రూ. 25 వేలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. అంతేకాదు కరోనా వార్తలను కవర్ చేస్తున్న ప్రతి జర్నలిస్టుకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కూడ పిటిషనర్ కోరారు. జర్నలిస్టులకు మెడికల్ కిట్స్, మాస్కులను ఉచితంగా ఇవ్వాలని కోరారు. రెండు వారాల్లోగా జర్నలిస్టులు ఇచ్చిన రిప్రజెంటేషన్ పై స్పందించి? సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ విషయమై తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ, ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ లకు హైకోర్టు మంగళవారం నాడు నోటీసులు జారీ చేసింది. ఈ విషయమై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ ప్రకటించారు.

ప్రగతిలో ప్రతి ఒక్కరికి ఆదర్శం తెలంగాణ

వేములవాడ, జూన్ 2(నేటినిజం ప్రతినిధి): టీఆర్ఎస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంల తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని చెక్క పల్లి బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహం వద్ద టీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు జెండాను ఎగరవేశారు . ఈ సందర్భంగా పార్టీ మండల పట్టణ అధ్యక్షులు గడ్డం హన్మాండ్లు ,పుల్కం రాజు మాట్లాడుతూ అనేక దశాబ్దాల పోరాట ఫలితంగా తెలంగాణ సాధించుకున్నామని అన్నారు .ప్రజలు కలలు కన్న తెలంగాణను కె??సిఆర్ చేసి చూపించారని అన్నారు . మన ముఖ్య మంత్రి రాష్ట్ర అభివృద్ధి కృషి చేస్తున్నారని అన్నారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి ,వైస్ చైర్మన్ మధు రాజేందర్ ,సెస్ డైరెక్టర్లు రామతీర్థం రాజు , జడల శ్రీనివాస్ , సింగిల్ విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి ,కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు , బింగి మహేష్ ,నరాల శేఖర్ ,సిరిగిరిరామచంద్రం ,గోలి మహేష్ ,కొండ పావని ,నిమ్మశెట్టి విజయ్ ,టీఆర్ఎస్ నాయకులు పొలాస నరేంద్ర , భాస్కరరావు ,పీర్ మహమ్మద్ ,రాపెల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.